జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
శుక్రవారం 2 అక్టోబర్ 2026 పేజీలు : 8



# వయోవృద్ధుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి





## మొదటి అర్ధ సంవత్సరంలో బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో

# సింగరేణి ముందంజ

గత ఆర్థిక అర్ధ సంవత్సరం కన్నా బొగ్గు రవాణాలో 4 శాతం, ఓవర్ బర్డెన్ తొలగింపులో 11 శాతం వృద్ధి

గత ఏడాది కన్నా తెలంగాణ జెన్ కో కు అధికంగా బొగ్గు సరఫరా

సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

8

# పోలీసు అభ్యర్థులు ఉచిత శిక్షణ అవకాశాన్ని వినియోగించుకోవాలి



పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోనే పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత శిక్షణ అవకాశాన్ని ఉద్యోగార్థులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా పోలీసు అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రారంభించారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి

# ప్రభుత్వం పెద్దపీట

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 1,( ప్రజా జ్యోతి)** వయోవృద్ధుల సంక్షేమం, భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు ఆయన



# మురిమడుగు గ్రామస్తులపై అటవీ శాఖ అధికారుల వేధింపులు ఆపాలి





## జాన్సన్ నాయక్

**జన్నారం,అక్టోబర్1(ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు గ్రామంలో అటవీశాఖ ట్రెంచ్ హద్దుల వివాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ అండగా నిలిచారు.బుధవారం మురిమడుగు గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత గ్రామస్తులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్లుగా గ్రామంలో నివాసం ఉంటూ తమ జీవనాధారమైన భూముల్లో సాగు చేసుకుంటున్న పేద రైతు కుటుంబాలకు అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అటవీ భూమిలోకి ప్రవేశం లేదంటూ జేసీబీలతో ట్రెంచ్‌లు ఏర్పాటు చేసి హద్దులు నిర్ణయించే చర్యలపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంఛార్జి జాన్సన్ నాయక్ మాట్లాడుతూ... పేదల జీవనాధారమైన భూముల విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవడం సరికాదని, ఏళ్లుగా అక్కడే నివసిస్తూ వ్యవసాయం చేసుకుంటున్న కుటుంబాల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా ఎలాంటి బలవంతపు చర్యలకు పాల్పడకూడదని అటవీశాఖ అధికారులను డిమాండ్ చేశారు.గ్రామస్తుల హక్కులు, వారి జీవనాధారం కాపాడే విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, మురిమడుగు గ్రామస్తుల సమస్య పరిష్కారం అయ్యే వరకు వారి తరఫున చట్టబద్ధంగా పోరాడుతామని జాన్సన్ నాయక్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్,ఫజల్ ఖాన్,అభిలాశ్, దేవన్న,శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన సొయా పంటను పరిశీలించి రైతును పరా మర్శించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**రైతులకు అండగా ఉంటాం**

**రైతులకు న్యాయం జరగక పోతే కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తా**

**మాళవిక కంపెనీపై కేసు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి**

**ఎకరానికి రూ. 50 వేల నష్ట పరిహారం చెల్లించాలి**



**తలమడుగు, అక్టోబర్ 1, (ప్రజా జ్యోతి)** తలమడుగు మండలంలోని రుయ్యడి గ్రామంలో రైతు చిన్న రాజారెడ్డి విగర్ కంపెనీ మాళ్విక రకం సొయా సాగు చేసి పంట దెబ్బతిన్న నేపథ్యంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మాళ్విక రకం సాగుతో జరిగిన నష్టంపై రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి కష్ట కాలంలో రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పంట నష్టానికి సం బంధించిన వివరాల ఆధారంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలు జోక్యం చేసుకొని మాళవిక కంపెనీపై కేసు బుక్ చేసి కఠి న చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ నుంచి ఎకరానికి రూ. 50 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డి మాండ్ చేశారు. తక్షణమే కంపెనీ వారిని జిల్లా కలెక్టర్, ఎస్పీ సమావేశం నిర్వహించి నష్టపోయిన రైతులకు అండగా ఉండలాని కోరారు. రైతులకు న్యాయం జరగపోతే, ఎలాంటి హామీ రాకపో తే కలక్టరేట్ ముందు భారీ ఎత్తున రైతులతో ధర్నాకి దిగుతానని హెచ్చరించారు రైతు కష్టం వృథా కాకుండా చూడటమే మా బాధ్యత అని పంట నష్టపోయిన ప్రతి రైతుకు అండగా నిలిచి కంపెనీ ద్వారా మొత్తం సహాయం అందేలా కృషి చేస్తాం” అని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, బీఆర్ ఎస్ నాయకులు, కార్య కర్తలు, రైతులు పాల్గొన్నారు.

## రక్తదానం.. ప్రాణదానంతో సమానం

**అత్యవసర వేళల్లో రక్తమే ప్రాణరక్ష**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఏ ప్రాణం పోకూడదని, సకాలంలో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి సీడం నాగేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యంగా ఉన్న యువత పెద్దఎత్తున స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్యంలో రక్తం కొరతను అధిగమించేందుకు రక్తదాన శిబిరాలు కీలకమన్నారు. ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొంటూ, మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం రక్తదానం చేసిన దాతలను సుగుణక్క అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఆర్గనైజర్ ఆడ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కందకాల తవ్వకాలతో మురిమడుగు నిరుపేదల ఆందోళన



**జన్నారం,అక్టోబర్1(ప్రజాజ్యోతి)**మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు సత్యసాయి నగర్‌లో అటవీశాఖ అధికారుల చర్యలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాలనీలోని పలు ఇళ్లు, భూముల చుట్టూ అధికారులు జేసీబీలతో కందకాలు తవ్వడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గురువారం కాలనీవాసులు సుద్దల పోశం, కుటికెల విజయ, పుదూరి లింగవ్వ తదితరులు వ మాట్లాడుతూ.. “గత 40 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నాం. ఇప్పుడు ఉన్నట్టుండి ఇళ్ల పక్కనే పెద్ద కందకాలు తవ్వడంతో రాకపోకలకు వీలులేకుండా పోయింది” అని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను ఖాళీ చేసే ప్రసక్తే లేదని, ఒకవేళ ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితి కల్పిస్తే రోడ్డుపైనే టెంట్లు వేసుకుని నిరసన తెలుపుతామని హెచ్చరించారు.సమాచారం అందుకున్న ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలకు అటవీశాఖ అధికారులు అన్యాయం చేస్తే సహించేది లేదని, బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎస్ఐ గుర్రం ఉదయ్‌కిరణ్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అటవీశాఖ అధికారులతో పాటు కాలనీవాసులతో మాట్లాడి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

## ఉధవల రైతు ప్రొడ్యూసర్ కంపెనీకి నూతన కమిటీ

రైతు సంక్షేమమే లక్ష్యంగా కొత్త పాలకవర్గం



**ఆసిఫాబాద్ అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా సేవలందిస్తున్న ఉధవల రైతు ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నూతన పాలకవర్గాన్ని సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ అట్లూరి పూర్ణ గురువారం వెల్లడించారు. సంస్థ చైర్మన్‌గా కాసర్ల గోపాల్, సెక్రటరీగా కావల్కర్ యాదవ్, ప్రధాన కోశాధికారిగా ఆత్రం నాయకు బాధ్యతలు చేపట్టారు.డైరెక్టర్లుగా అజ్మీరా ప్రేమ్‌చంద్, ప్రకాష్, లక్ష్మయ్య, పున్నందాస్, తిరుపతి, మనకు, పగ్గుబాయి ఎంపికయ్యారు. సీఈఓగా భుక్య పవిందర్, అకౌంటెంట్‌గా కావల్కర్ నితిన్ బాధ్యతలు స్వీకరించారు. ఆడ దస్నాపూర్ సర్పంచ్ విజేస్‌కు కూడా కీలక బాధ్యతలు అప్పగించినట్లు నిర్వాహకులు తెలిపారు.నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని రైతులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం సంస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### పార్లమెంట్ సభ్యులు గెడం నగేష్



**ఖానాపూర్ అక్టోబర్ 1( ప్రజా జ్యోతి )** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మది దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ బీజేపీ నిర్మల్ జిల్లా కార్యాలయంలో స్వయంగా గురువారం మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి మొక్క నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం"అని ఎంపీ నగేష్ పిలుపునిచ్చారు.ప్రధాని మోడీ నేతృత్వంలో దేశం ప్రపంచంలోనే అత్యంత స్థాయికి చేరుతుందని దేశ ప్రజలు రానున్న ఎన్నికల్లో భాజాపాకు వెన్నంటి ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాతాళం చిన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్ర కాంత్, జిల్లా కార్యదర్శి పుస్పూర్ నర్సారెడ్డి, కౌన్సిలర్లు ఓడిసేలా అర్జున్, సూరజ్ నాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, ఎండోమెంట్ సెల్ జిల్లా అధ్యక్షులు కందుల హరీష్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు కుమ్మరి వెంకటేష్, బీజేపీ సీనియర్ నాయకులు పూదరి రంజిత్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అభ్యర్థులు ఉచిత శిక్షణ అవకాశాన్ని వినియోగించుకోవాలి



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 1 , ( ప్రజాజ్యోతి ).**పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోనే పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత శిక్షణ అవకాశాన్ని ఉద్యోగార్థులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా పోలీసు అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీసు అభ్యర్థులకు ఉచిత భోజనంతో పాటు శిక్షణ అందిస్తున్న జిల్లా ఎస్పీ, పోలీసులకు, సహకరిస్తున్నవారికి శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాదు లాంటి దూర ప్రాంతానికి వెళ్ళి ఉద్యోగ శిక్షణ పొందడం ఎంతో ఖర్చుతో కూడుకున్న విషయమని, జిల్లా కేంద్రంలోనే అభ్యర్థులకు అందుబాటులో ఉన్న ఈ శిక్షణ ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధ (ఏఐ) కాలంలో ఉద్యోగం పొందడం కష్టంతో కూడుకున్న పని అని, ప్రస్తుతం ఉద్యోగాలకు ఎంతో పోటీ ఉందని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సూచించారు. దూర ప్రాంతాల విద్యార్థులకు వసతి సౌకర్య కల్పనలో తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

**పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడాలి**

**జిల్లా ఎస్పీ జానకి షర్మిల**

పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా ప్రతి ఒక్క అభ్యర్థి కష్టపడి చదువుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా అభ్యర్థులకు ఉచిత పోలీసు శిక్షణలో సహకరించినవారికి, స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత పోలీసు శిక్షణకు దాదాపు 300 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారని అన్నారు. అభ్యర్థులకు ఒక పూట ఉచితంగా భోజనం, అల్పాహారం, అవసరమైన తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. సుదూర ప్రాంత విద్యార్థులకు అవసరమైన వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగ సన్నద్ధానికి అవసరమైన మెటీరియల్ సమకూర్చేలా చూస్తామన్నారు. ఉద్యోగార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించామని, అలాగే స్వయంగా బోధనా అనుభవం ఉన్న పోలీసు సిబ్బందిచే సైతం విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి రెండ్రోజులకు ఒకసారి పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. దేహదారుఢ్య (ఫిజికల్ ఈవెంట్స్) పరీక్షలకు అవసరమైన శిక్షణ సైతం అందిస్తామన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలిగినా అందుబాటులో ఉన్న సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పనులు సరే బిల్లులు ఏవి..?

**అధికారుల తీరుపై మండిపడ్డ సర్పంచులు**

**అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం**



**లోకేశ్వరం అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి)** గెలిచి పది నెలలు గడుస్తున్న చేసిన పనులకు నేటి వరకు బిల్లులు అందరం లేదని మండల సర్పంచ్ల ఫోరం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముందు గురువారం జరిగిన జనరల్ బాడీ మీటింగ్ సమావేశంలో సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు ఇంకా పనులు చేయమంటే ఎక్కడినుండి చేస్తామని పెట్టుబడికి డబ్బులు ఎలా వస్తాయని వారు ఆవేదనతో ఎమ్మెల్యే ముందు మొరపెట్టుకున్నారు గురువారం రోజున మండల ప్రత్యేక అధికారి దయానంద్అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు సిసి రోడ్లు, అంగన్వాడి బిల్డింగులు, జిపి బిల్డింగులు, నిర్మించి పది నెలలు గడుస్తున్న నేటి వరకు బిల్లులు అందకపోవడంపై సర్పంచులు మండిపడ్డారు కేవలం 15 ఆర్థిక సంఘం నిధులు తప్ప ఏమి రావడం లేదని వారి పేర్కొన్నారు ఆ డబ్బులు కేవలం డిజిలు వాటర్ సౌకర్యం విద్యుద్దీపాలకి సరిపోతున్నాయని వారి పేర్కొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆయన తెలిపారు ప్రతి శాఖ పై అధికారుల నివేదిక తీసుకున్న ఎమ్మెల్యే పటేల్ వచ్చే సమావేశం నాటికి ఏ పనులు కూడా పెండింగ్లో ఉండకూడదని అధికారులను హెచ్చరించారు ఇందిరమ్మ ఇల్లు కేవలం ఊరికి ఆరు ఏడు మాత్రమే ఇచ్చారని ఇంక అరులైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరు కావడం లేదని వారు ఆవేదనతో ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్ల ఫోరం తీసుకువచ్చారు అబ్దుల్లాపూర్ సర్పంచ్ దడిగ జయలలిత మాట్లాడుతూ మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చి ఐదు సంవత్సరాలు గడిచిన నేటి వరకు నీళ్లు రావడంలేదని ఆ శాఖ ఏఈ ప్రశ్నించారు స్పందించిన ఎమ్మెల్యే ఆరు నెలల్లో సమస్య పునరావృతం కావద్దని మిషన్ భగీరథ ఆ శాఖ ఇంజనీర్ కు సూచించారు అందరికీ ఇల్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దయానంద్ ఏపిడి నాగవర్ధన్, ఎంపీడీవో రామకృష్ణ, తాసిల్దార్ సూర్యరావు తాసిల్దార్ సూర్యారావు, ఎంపీ ఓ సల్మాన్ రాజ్, సొసైటీ చైర్మన్ రత్నాకర్ రావు ఆయా శాఖల అధికారులు సర్పంచులు పాల్గొన్నారు

# ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

## ఓటర్లను కార్యాలయాలకు పిలిచి నోటీసులు, పత్రాల స్వీకరణ చేయరాదు

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి








**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 1 ,( ప్రజాజ్యోతి )**ఎస్ఐఆర్–2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎస్ఐఆర్–2026, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవరాదని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం–6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం–6, ఫారం–7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సీఈఓ సూచించారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ తెలిపారు. ఈ వీసీలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎస్ఐఆర్ వివరాలు ఎన్నికల ఉన్నతాధికారులకు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను మొత్తం నిబంధనల ప్రకారం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో సినీ తారల సందడి

**ఒకేరోజు రెండు ప్రముఖ షాపింగ్ మాల్స్ ప్రారంభం..**
**భారీగా తరలివచ్చిన అభిమానులు**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 1 ,( ప్రజాజ్యోతి )**నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం సినీ తారల సందడి నెలకొంది. ఒకేరోజు రెండు ప్రముఖ వస్త్ర షాపింగ్ మాల్స్ ప్రారంభం కావడంతో పాటు ప్రముఖ హీరోయిన్లు శ్రీలీల, ఐశ్వర్య రాజేష్ హాజరుకావడంతో పట్టణంలో ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. వస్త్ర ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన చెన్నై షాపింగ్ మాల్ నూతన షోరూమ్‌ను ప్రముఖ హీరోయిన్ శ్రీలీల లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెన్నై షాపింగ్ మాల్ షోరూమ్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు 35 షోరూమ్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. నిర్మల్ పట్టణానికి రావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని నిర్మల్ ప్రజలు నూతన షోరూమ్‌లో షాపింగ్ చేయాలని ఆమె కోరారు.

**చందన బ్రదర్స్ బ్రాంచ్ ప్రారంభించిన ఐశ్వర్య రాజేష్**

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన చందన బ్రదర్స్ నూతన



బ్రాంచ్‌ను ప్రముఖ నటి ఐశ్వర్య రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. నూతన షాపింగ్ మాల్‌లో సరికొత్త కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ప్రజలు షాపింగ్ చేయాలని కోరారు.

**హీరోయిన్లను చూసేందుకు భారీగా తరలివచ్చిన జనం**

నిర్మల్‌లో ఒకేరోజు రెండు ప్రముఖ వస్త్ర షాపింగ్ మాల్స్ ప్రారంభం కావడంతో పాటు సినీ హీరోయిన్లు శ్రీలీల, ఐశ్వర్య రాజేష్ హాజరుకావడంతో పట్టణంలో సందడి నెలకొంది. తమ అభిమాన



తారలను చూసేందుకు అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో షోరూమ్‌ల పరిసర ప్రాంతాలు జనసందోహంతో కిటకిటలాడాయి. రెండు షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవాలు నిర్మల్ పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పాయి.

# ఆధునిక సాంకేతికతను వ్యవసాయంతో అనుసంధానం చేసుకొని ముందుకు సాగాలి








### ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 1 ,( ప్రజాజ్యోతి )మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆధునిక సాంకేతికతను దృష్టిలో ఉంచుకొని రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ సూచించారు.గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎఫ్.ఎస్.సి.ఎస్. కన్వెన్షన్‌లో ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ--ఆత్మ ), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఎంపీ గోడం నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి, వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బెట్టను తట్టుకునే రకాలు, తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలు, పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పంటల ఎంపిక సమయంలో వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులు, విత్తనాల లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని తెలిపారు. దేశంలో వంటనూనెలతో పాటు ఇతర వ్యవసాయ ముడి సరుకుల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించాలని రైతులకు సూచించారు.నిర్మల్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తుండటం అభినందనీయమని పేర్కొన్న ఎంపీ, రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళాలు, రైతు సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

### వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేయడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు జిల్లా స్థాయి కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎరువుల సరఫరా, పంటల బీమా, బ్యాంకింగ్ సేవలు, వ్యవసాయ సాంకేతికత, ఆధునిక సాగు విధానాలు తదితర అంశాలపై మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి సంబంధిత అధికారుల నుంచి సమాచారం, సలహాలు పొందాలని సూచించారు. జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే 100 శాతం పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. రైతులు వాస్తవంగా సాగు చేస్తున్న పంటల వివరాలు డిజిటల్‌గా నమోదు కావడం వల్ల పంటల వివరాల్లో మిస్‌మ్యాచ్‌కు అవకాశం తగ్గుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో జిల్లాలో 80 శాతానికి పైగా నమోదు పూర్తయిందని తెలిపారు. రైతుల వివరాలు డిజిటల్‌గా నమోదు చేయడం ద్వారా అర్హులైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను మరింత పారదర్శకంగా అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.జిల్లాలో ప్రస్తుతం సుమారు 9,400 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. రానున్న రోజుల్లో మరింత విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలు, పెట్టుబడి సహాయం, మార్కెట్ సమాచారం అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.ఆత్మ కమిటీ భైంసా డివిజన్ చైర్మన్ వివేకానంద మాట్లాడుతూ, యూరియా సరఫరాకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.ఆత్మ కమిటీ నిర్మల్ డివిజన్ చైర్మన్ రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆత్మ కమిటీలను మరింత బలోపేతం చేసి రైతులకు సాంకేతిక, శాస్త్రీయ సాగు విధానాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.కిసాన్ మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, సహకార, గ్రామీణాభివృద్ధి, అటవీ, మత్స్య, విత్తన కార్పొరేషన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం తదితర శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేశారు.ఎరువులు, బయో ఫర్టిలైజర్స్, డ్రిప్ ఇరిగేషన్, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, ఆధునిక సాగు విధానాలు తదితర అంశాలపై స్టాళ్ల నిర్వాహకులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న సేవలు, ఆధునిక సాంకేతికతపై రైతులకు వివరించారు.మత్స్యశాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మంజూరైన రెండు ట్రాలీ ఆటోలను లబ్ధిదారులు అనిత, లక్ష్మిలకు ఎంపీ, కలెక్టర్ అందజేశారు. రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల రైతు బీమా చెక్కును అందించారు.కిసాన్ మేళా ద్వారా రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులతో నేరుగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్లు వివేకానంద, రాంరెడ్డి, సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు భీమ్ రెడ్డి, కళ్యాణ్, ఎఫ్.ఎస్.సి.ఎస్. చైర్మన్ ధర్మాజీ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఉద్యానవన అధికారి రమణ, పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాం గోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహాన్, రాహుల్ విశ్వకర్మ, రాంగోపాల్ వర్మ, దినేష్, సురేష్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

---

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 1 ,( ప్రజాజ్యోతి ) ప్రభుత్వ విద్యా సంస్థల్లో అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో, ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన బడుల్లో అదనపు తరగతు గదుల నిర్మాణం, తాగునీటి వసతి కల్పన, మరుగుదొడ్లు, డ్రైనేజీ, నిర్మాణం మరమ్మత్తులు, ఇతర నిర్మాణ, మరమ్మత్తుల పనులు చేపట్టాలన్నారు. ఆయా పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న పనులను అధికారులను అడిగి తెలుసుకు న్నారు. పనులన్నీ నాణ్యవంతంగా చేపట్టడంతో పాటు, వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్య ను అభ్యసించేలా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఈడబ్ల్యుఐడిసి డిప్యూటీ ఈఈ గంగాధర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# గిన్నెరలో ముమ్మరంగా రైతు రిజిస్ట్రేషన్ ప్రత్యేక డ్రైవ్

**రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అధికారుల పిలుపు**

**కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే రిజిస్ట్రేషన్ ప్రాధాన్యం**

**ఉట్నూర్,అక్టోబర్ 1 ( ప్రజా జ్యోతి )** గిన్నెర గ్రామపంచాయతీ పరిధిలోని రైతులకు వివిధ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించేందుకు అధికారులు ప్రత్యేక కసరత్తు ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని పట్టా మరియు అటవీ (ఫారెస్ట్) భూములు కలిగిన రైతులందరికీ ఉద్దేశించిన రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియపై గురువారం ఒక ప్రత్యేక డ్రైవ్ (కార్యక్రమాన్ని) నిర్వహించారు.?ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో సమావేశమై రిజిస్ట్రేషన్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యతను, అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... "ప్రతి రైతు ఎలాంటి మినహాయింపు లేకుండా తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి. భూమి వివరాలు, ఖాతా సంఖ్యలు సరిగా నమోదు చేయించుకోవడం వల్ల భవిష్యత్తులో పంట రుణాలు, పరిహారం పొందడంలో సులభతరం అవుతుంది. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ వంటి పలు రకాల సంక్షేమ పథకాలు, సబ్సిడీ లబ్ధి పొందాలంటే ఈ రిజిస్ట్రేషన్ అత్యంత ప్రాధాన్యం. ఒకవేళ నిర్ణీత సమయంలోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోకపోతే, అర్హులైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం



అందించే వివిధ ప్రయోజనాలు మరియు పథకాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది" అని స్పష్టం చేశారు.?అందువల్ల గ్రామ పరిధిలోని పట్టాదారులు, అటవీ భూముల హక్కుదారులు (ఆర్వోఎఫ్ఆర్) ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా వెంటనే తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెస్రం భీమ్‌రావ్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో ) షైజాన్, మడావి ముకుంద్, జగ్నాక లక్ష్మణ్, జైతు, ఇస్తారి పటేల్,స్థానిక వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిన్నెర తండా పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ

**ఉట్నూర్, అక్టోబర్ 1 ( ప్రజా జ్యోతి )** ఉట్నూర్ మండల పరిధిలోని గిన్నెర తండా ప్రాథమికోన్నత పాఠశాల (ఎమ్‌పియుపిఎస్)లో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠశాల దుస్తుల (యూనిఫాంలు) పంపిణీ కార్యక్రమం సర్పంచ్ మేస్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యాబోధన తో పాటు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు ప్రజాప్రతినిధులు,



ఉపాధ్యాయుల చేతుల మీదుగా దుస్తుల సెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ ( ఎస్ఎంసి ) చైర్మన్ మెస్రం లలిత, ఉప సర్పంచ్,విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షుడినీ సన్మానించిన ఎమ్మెల్యే

**--పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే**

**నేరడిగొండ అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి):** మండల ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రిపోర్టర్ శ్రీకాంత్ ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులు, ఇండ్ల స్థలాలు, సంఘ సంక్షేమానికి కృషి చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్



సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తూ కృషి చేస్తానని తెలిపారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సమాజ అభివృద్ధికి పాత్రికేయులు చేస్తున్న సేవలు అభినందనీయమనీ తెలిపారు. పాత్రికేయుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు స్వామి గౌడ్, కార్యదర్శి రాథోడ్ సందీప్, శోభన్ రెడ్డి, నవీన్, ప్రమోద్, దేవేందర్. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రక్త దాతలు ప్రాణ దాతలు ప్రపంచ రక్తదాతల దినోత్సవంతో

**రక్త దాత డాక్టర్ వేణుగోపాలకృష్ణ వెల్లడి**




**ఖానాపూర్ అక్టోబర్ 1(ప్రజాజ్యోతి)**ప్రపంచరక్త దాతల దినోత్సవం సందర్భంగా నిర్మల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ వేణుగోపాలకృష్ణ నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రక్తనిధికేంద్రంలో రక్తదాతలకు స్ఫూర్తిగా మాటాడారు. రక్తదానం అవశ్యకత ,ప్రత్యేకతల గురించి వివరించారు. ప్రతి ఒక్కరు రక్తదానానికి ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని కోరారు .ఎ నెగెటివ్ అనే అరుదైన రక్తం నమూనా కలిగిన తనే 57 సార్లు రక్తం దానం చేసి చాలా ఆరోగ్యంగా ఉన్నాననితెలియ చెప్పారు డాక్టర్ వేణుగోపాలకృష్ణ. రక్తానిధి కేంద్రం సిబ్బంది ,రోగులు , బంధుమిత్రులు ఆయనని అభినందించారు.ఇందులో రాకేష్ రాజకుమార్ ,రాము రమణ ,ఉదయ్, మహేష్,రాముతదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ భవన నిర్మాణ సెంట్రింగ్ 50 మందికార్మికులు (సీఐటీయూ )లో చేరిక



**ఖానాపూర్ అక్టోబర్ 1( ప్రజా జ్యోతి )**ఖానాపూర్ పట్టణంలోని పి ఆర్ టి యు భవనంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ ) ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఖానాపూర్‌కు చెందిన పలువురు సెంట్రింగ్ కార్మికులు భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ )లో చేరారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ సంఘం బీసీ డబ్యూ డబ్యూ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూర్ రాములు అధ్వర్యంలో సీఐటీయూ కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ,, భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ లేబర్ కార్డులు మంజూరు చేయాలని, ప్రత్యేకంగా కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే భవన నిర్మాణ కార్మికులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు నెలకు రూ.6,000 పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పని చేస్తున్న సీఐటీయూ సంఘంతో మేము కలిసి పని చేస్తామని కార్మికులు సీఐటీయూ సంఘంలో చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బొమ్మెనసురేష్ సిఐటియు నిర్మల్ జిల్లా కార్యదర్శి, నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు క్లైమెంట్ వేస్లీ, సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు సోనాల రాజేశ్వర్, కార్యదర్శి బాబా, కోశాధికారి శ్రీనివాస్, నాయకులు రాజన్న గోపాల్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



జిల్లా కలెక్టర్ రాజర్షిషా





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 1,( ప్రజా జ్యోతి)** వయోవృద్ధుల సంక్షేమం, భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు.గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధు ల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా వృద్ధాశ్రమం, ప్రణాం డే కేర్ సెంటర్ల ను ఏర్పాటు చేసి విజయ వంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వారికి మెడిక ల్ హెల్ప్ క్యాంపులు, కంటి పరీక్షలు, ప్రభుత్వపరంగా అందవలసిన పుస్తకాలు, సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు లేదా ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే తమ తల్లి దండ్రులను, వయోవృద్ధులను సరిగా చూసుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. బాధ్య త విస్మరించి వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే, వారి జీతం నుం చి ఆటోమేటిక్‌గా కోత విధిం చి నేరుగా వృద్ధులకు అందించేలా చట్టపరమైన నిర్ణయం తీసుకున్నామని, ఇది ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందని తెలిపారు. అదేవిధంగా, గతంలో భావోద్వేగంతో పిల్లలకు రాసిచ్చిన భూములను, ఆతర్వాత వారు సరిగ్గా చూసుకోకపోతే తిరిగి వెనక్కి పొందేలా చట్టంలో వెసులుబాటు ఉందని అన్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే వయోవృద్ధులు నేరుగా తనకు దరఖాస్తు చేసు కోవచ్చని, వెంటనే స్పందించి న్యాయం చేస్తామని భరో సానిచ్చారు. జపాన్ తరహాలో రాబోయే రోజుల్లో మన దేశంలోనూ వయోవృద్ధుల సంఖ్య పెరుగుతుందని, ఆసమాజానికి తగినట్లుగా వారి ఆరోగ్యం, డే కేర్ కార్యక లాపాలు, రక్షణ బాధ్యతలను ప్రతి ఒక్కరూ విస్మరించ కుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.అనంతరం పలువురు వయోవృద్ధులను కలెక్టర్ శాలువాతో సత్కరించి, మోమంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, వయోవృ ద్ధుల సమైక్య ప్రతినిధులు దేవిదాస్ దేశ్పాండే, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వ యోవృద్ధులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్- 2026 ప్రక్రియ చేపట్టాలి








## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 1,(ప్రజా జ్యోతి)** భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్- 20 26 ప్రక్రియను ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎస్ఐఆర్-2026, గ్రాడ్యు యేట్ ఎమ్మెల్సీ ఓటరు న మోదు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సీ ఈఓ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్ట రేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల ను నోటీసులు స్వీకరించేం దుకు లేదా అవసరమైన ప త్రాలు సమర్పించేందుకు కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయ డంతో పాటు, అవసరమైన పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలి అని సూచించారు. సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవ రాదని, తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించా ల్సివస్తే ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదే శించారు.కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పిం చే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని సీఈఓ తెలిపారు. ఎస్ ఐ ఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపో యినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సంద ర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శిం చాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. అలాగే ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటిక ప్పుడు అందించాలని సీ ఈ ఓ సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అను గుణంగా నిర్వహించాలని సీఈఓ సూచించారు. సంబంధిత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి చెందిన అర్హత కలిగిన వ్యక్తులు 31.10.2023 నాటికి గ్రా డ్యుయేషన్ పూర్తి చేసి ఉంటే ఓటరుగా నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని తెలిపారు. అయితే ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు 01.1 1.2026ను అర్హత తేదీగా పరిగణించాలని సీఈఓస్పష్టం చేశారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట రుగా నమోదైన వారు కూడా ప్రస్తుత నమోదు ప్రక్రియలో మరోసారి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు సమర్పించే మార్కుల మెమో జిరాక్స్ ప్రతిని గెజిటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ ఐఆర్-2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గ దర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని సీఈఓ సూచించారు. ప్రతి దశలో పారదర్శకత పాటిస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, పర్యవేక్షకురాలు నలంద ప్రియ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిరి సంపద రైతు ఉత్పత్తిదారుల కంపెనీ చైర్మన్‌గా భానుదాస్

**సిరికొండ, అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి)**సిరికొండ మండల కేంద్రంలోని సిరి సంపద రైతు ఉత్పత్తిదారుల కంపెనీ చైర్మన్ ఎన్నిక గురువారం ఉత్కంఠభరితంగా జరిగింది. ఈ చైర్మన్ పదవికి గోర్బండ్ ప్రకాష్, భానుదాస్ పోటీ పడగా, నిర్వహించిన ఓటింగ్‌లో ఇద్దరికీ చెరో 6 ఓట్లు వచ్చాయి. దాంతో అధికారులు లక్కీ డ్రా నిర్వహించగా, అదృష్టం భానుదాస్‌ను వరించడంతో ఆయనను చైర్మన్‌గా ప్రకటించారు.?ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ భానుదాస్ మాట్లాడుతూ...రాజకీయాలకు అతీతంగా రైతులకు సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటానని, రైతు ప్రయోజనాలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ఎటువంటి అవకతవకలు జరగకుండా సంస్థను పారదర్శకంగా ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## కరత్వాడ ప్రాజెక్టునీటి విడుదల



**బోథ్ అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి):**రత్వాడ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా గురువారం నీటి విడుదల ప్రారంభమైంది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంటలను కాపాడేందుకు సరైన సమయంలో కాలువలకు నీటిని విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ ఈఈ భుక్య భీమ్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ జాదవ్ ప్రకాశ్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈఈ భుక్య భీమ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ప్రాజెక్టు నీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించి వృథాను అరికట్టాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటంతో భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో పెరగలేదని తెలిపారు. ప్రస్తుతం రైతులకు ఆధారంగా ఉన్న కరత్వాడ ప్రాజెక్టు నీటిని పొదుపుగా వినియోగించుకుని చేతికొచ్చిన పంటలను కాపాడుకోవాలని సూచించారు.

**అక్టోబర్ 1 నుంచి 10 వరకు నీటి సరఫరా**

కరత్వాడ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అక్టోబర్ 1 నుంచి 10వ తేదీ వరకు నీటి సరఫరా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. అనంతరం కాలువలను మూసివేసి, పది రోజుల విరామం తర్వాత తిరిగి నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు.కరత్వాడ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో రెండో పంటకు నీరు అందించే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఆయకట్టులో ఒక పంటకు మాత్రమే నీరు అందించేందుకు ప్రాజెక్టు నీటి లభ్యత ఉందని తెలిపారు. రైతులు రెండో పంట సాగు చేయకుండా సహకరించాలని కోరారు. డిసెంబర్‌లో నీటి సరఫరా నిలిపివేయనున్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు చేపట్టాలని అధికారులు సూచించారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు.

**-సోనాల తహసిల్దార్ మల్లేష్**



**సోనాల, అక్టోబర్ 01 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండల పరిధిలో గల వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహన యజమానులపై ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మార్వో మల్లేష్ తెలిపారు. ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటకపోవడమే కాకుండా తాగునీటి సమస్య ఏర్పడుతుందని అన్నారు. నిర్లక్ష్యం చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

## విద్యార్థుల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్‌లను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 1,(ప్రజా జ్యోతి)** పాఠశాల విద్యార్థుల ఆధార్ నమోదు తప్పనిసరి అని, బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రి యను శరవేగంగా పూర్తి చే యాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశిం చారు.గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో విద్యార్థుల ఆధార్ అప్‌డేట్‌ల పురోగతి పై ఆయన సమీక్షా సమావే శం నిర్వహించారు. ఈ సం దర్భంగా జిల్లాలో ఇప్పటివ రకు పూర్తయిన బయోమెట్రి క్ అప్‌డేట్‌ల వివరాలను ప రిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తీసుకోవాల్సి న చర్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, పాఠశాల వయస్సు కలిగిన విద్యార్థులందరికీ ఆ ధార్ నమోదు తప్పనిసరి అని, బయోమెట్రిక్ అప్‌డేట్ లు ప్రాధాన్యత క్రమంలోపూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఎలాంటి ఆధార్ కార్డు లేని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే నమోదు ప్రక్రియ చేప ట్టాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా దసరా సెలవుల అనంతరం ప్రతి మండల స్థాయిలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను ఏర్పాటు ఆదేశించారు. ఈ శిబిరాల ద్వారా అర్హులైన వి ద్యార్థులకు అవసరమైన ధృ వీకరణ పత్రాలను ముందు గానే సమకూర్చి, ప్రక్రియను మరింత సులభతరం చేయా లన్నారు. విద్యార్థుల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ లలో గరిష్ట పురోగతి సాధించి నూటికి నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు, ఆధార్ మాన్‌పవర్ ఏజెన్సీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పూర్తి సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశంచేశారు. ఈ సమావేశంలో విద్యా శాఖ అధికారి మాధవి, పాఠశా ల విద్యాశాఖ రాష్ట్ర ఆధార్ కన్సల్టెంట్ ప్రవీణ్ కుమార్, ఆధార్ మాన్‌పవర్ ఏజెన్సీ డైరెక్టర్ విలాసిత, ప్రాజెక్ట్ మే నేజర్ లక్ష్మణ్, జిల్లా కోఆర్డినే టర్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ ప్రగతికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

**విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 1,(ప్రజా జ్యోతి )** రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరు గు పరచడంతో పాటు నిర్వహణలో లోపాలను పూర్తిగా సరిదిద్దేందు కు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం రిమ్స్ ఆడిటోరి యంలో అధికారులు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు, యూనియన్ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమా వేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సి బ్బందికి నెలవారీ వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని, వేతనాల్లో అనధికారిక కోతలు విధిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేటాయించి న విధులను వదిలి ఇతర ప నులకు వెళ్లే సిబ్బందిని ఉపే క్షించబోమన్నారు. సానిటేష న్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో సిబ్బంది కొరత ను అధిగమించేందుకు అవ సరమైన మేరకు సిబ్బందిని పెంచాలని సూచించారు. రిమ్స్‌లోకి అనధికారిక ప్రవే శాలను అరికట్టేందుకు గతంలో అమల్లో ఉన్న పాస్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీల వెంట ఇద్దరు, ఇతర రోగుల వెంట ఒకరు లేదా ఇద్దరు సహాయకులకు మాత్రమే అనుమతి ఉండే లా గేటు వద్దే నియంత్రణ చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా ఆసుపత్రిలోకి ప్రవే శించకుండా సెక్యూరిటీ సి బ్బంది కఠినంగా వ్యవహరిం చాలన్నారు. రిమ్స్ ప్రాంగ ణంలో గుట్కా నమలడం, ధూమపానం చేయడం, ప్లా స్టిక్, వ్యర్థాలను ఎక్కడపడి తే అక్కడ వేయడం వంటి చర్యలకు పాల్పడితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అధికారులు, సూపర్‌వైజర్లు త మ పరిధిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదే శించారు.రిమ్స్‌లో సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆన్‌లైన్ హాజరు నమోదు చేస్తున్నప్పటికీ, రిజిస్టర్‌లో ఉన్న 420 మందిలో 350 మంది మాత్రమే విధులకు హాజరవుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన 70 మంది హాజరు కాక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ హాజ రు వ్యవస్థలో ఉన్న సాంకేతిక సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. నవంబర్ నుంచి ఆన్‌లై న్ హాజరు ఆధారంగానే వే తనాలు విడుదల చేయను న్నట్లు స్పష్టం చేశారు. ప్రభు త్వం మంజూరు చేసిన రూ. 11 కోట్ల నిధులతో రిమ్స్‌లో లిఫ్టులు, ట్రాన్స్‌ఫార్మర్ల మర మ్మతు పనులను త్వరితగ తిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వీల్‌చైర్లు, హెచ్ డీ ఎస్ నిధులతో కొనుగోలు చేసిన స్ట్రెచర్లను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆసుపత్రి వ్యర్థాలను మున్సిపల్ డంప్ ఇయార్డుకు తరలించేందుకు ప్రత్యేక ట్రాక్టర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఉద్యోగుల ఈపీఎఫ్, ఈ ఎస్ఐ బకాయిలను డిసెంబర్ 3లోగా పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సమన్వ యంతో పనిచేయాలని సూ చించారు. అంతకు ముందు రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఔ ట్‌సోర్సింగ్ సిబ్బంది విధుల నిర్వహణ, వేతన సమస్యలు, ఇతర అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ సాధ న, డీపీఓ రమేష్, మున్సిప ల్ కమిషనర్ జగదీశ్వర్ గౌ డ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతి నిధులు, యూనియన్ నాయకులు తదితరులు పా ల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడికి సన్మానం



**సోనాల, అక్టోబర్ 01( ప్రజాజ్యోతి ):** కాంగ్రెస్ పార్టీ సోనాల మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాడార్ల శ్రీనివాస్ కు ఘన సన్మానం. సోనాల మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కాడార్ల శ్రీనివాస్ కు ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల పోతన్న, వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె మహిముద్, టౌన్ ప్రెసిడెంట్ కసిరి పోతున్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జుంగాల భోజన్న, పోర్బ్ మెంబర్ అమృతరావ్, సుదర్శన్, భువనేశ్వర్, రామ కాంత్, రామచందర్, లాలూ రామ్, జాకు మాజీ సర్పంచ్లు రాందాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'సిరి సంపద' రైతు ఉత్పత్తిదారుల చైర్మన్‌గా భానుదాస్ ఏకగ్రీవ విజయం

--విజేతలను సన్మానించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**నేరడిగొండ /సిరికొండ, అక్టోబర్ 01 (ప్రజాజ్యోతి):** సిరికొండ మండల 'సిరి సంపద' రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి గురువారం నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. మండలంలోని పొన్న గ్రామానికి చెందిన భాను దాస్ చైర్మన్‌గా ఎన్నికవగా, పోటీ చేసిన ఆరుగురు డైరెక్టర్లు విజయం సాధించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన చైర్మన్ భాను దాస్‌తో పాటు డైరెక్టర్లను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. విజేతలు తమ గెలుపును ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఏ ఎన్నికలు వచ్చినా విజయం బీఆర్ఎస్ అభ్యర్థులదేనని, 'సిరి సంపద' రైతు ఉత్పత్తిదారుల ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని అన్నారు. గెలుపొందిన ప్రతినిధులు ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడి సేవలు అందించాలని సూచించారు. కేసీఆర్ స్ఫూర్తితో, కేటీఆర్ అండతో భవిష్యత్తులో మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నవ నిర్వాహిత చైర్మన్ భానుదాస్ మాట్లాడుతూ.. పొన్న గ్రామానికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాక తర్వాత రైతుల్లో కొత్త ఉత్సాహం నిండిందన్నారు. కేటీఆర్ సంకల్పం, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందించిన ధైర్యంతో రైతుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్న సర్పంచ్ సూర్యకాంత్ పాటిల్, మాజీ సర్పంచ్ పెంటన్న, నాయకుడు సూర్యకాంత్, కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు తోకల చందు, జైనులొద్దిన్‌లతో పాటు పలువురు స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సేవ చేసే వారినే గెలిపించండి

ఐఆర్‌సిఎస్ మాజీ కో ఆర్డి నేటర్ కుంట కిరణ్ కుమార్ రెడ్డి పిలుపు



**అదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 1 ( ప్రజా జ్యోతి )** ఈ నెల 4న జరగనున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల్లో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించే అభ్యర్థులనే గెలిపించాలని ఐఆర్‌సిఎస్ నేరడిగొండ మా జీ కోఆర్డినేటర్ కుంట కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడు తూ మాజీ చైర్మన్ ఎస్. గం గేశ్వర్ గత 35 ఏళ్లుగా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సమా జానికి ఎనలేని సేవలందిస్తున్నారని కొనియాడారు. గడిచిన 10 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తూ, మంగ్లీ, బుర్కి వంటి మారు మూల గిరిజన గ్రామాల్లో సై తం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చే శారు. ఆపద సమయంలో నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకులకు తమ అమూ ల్యమైన ఓటు వేసి గెలిపిం చాలని పిలుపునిచ్చారు. గెలిపించాల్సిన అభ్యర్థుల ప్యానెల్ (సీరియల్ నంబర్ల వారీగా): నెంబర్ 4: మహ మ్మద్ ఆయుబ్ ఖాన్, నెం బర్ 10: దినేష్ గౌడ్, నెంబర్ 11: ఎస్. గంగేశ్వర్, నెంబర్ 14: జూన్పల్లి సంజీవ్ రావు, నెంబర్ 18: కుంట కిరణ్ కుమార్ రెడ్డి, నెంబర్ 23: మే కల వెంకటస్వామి, నెంబర్ 28: డాక్టర్ ప్రఫుల్ వాజే, నెంబర్ 29: సామల ప్రశాం త్, నెంబర్ 33: సామ రూపే ష్ రెడ్డి, నెంబర్ 46: జి. విజ య్ బాబు సొసైటీ అభివృద్ధి కి, ప్రజా సేవకు నిరంతరం శ్రమించే ఈ అభ్యర్థులంద రినీ భారీ మెజార్టీతో గెలి పించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

# సోన్ తహసిల్దార్ సంతోష్ కి మెమోరాండం అందజేస్తున్న గ్రామీణ వైద్యులు



**సోన్,అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ కి వినతి పత్రం అందజేసిన గ్రామీణ వైద్యులు ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల మండల అధ్యక్షులు పత్తి రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని జీవనభృతి కల్పించాలని, తాము పల్లెటూర్లలో ఎంతో శ్రమించి అర్ధరాత్రి ఏ కష్టం వచ్చినా ఏ అనారోగ్యం వచ్చిన కార్పొరేట్ హాస్పిటల్స్ రావు, పెద్ద పెద్ద డాక్టర్లు అందుబాటులో ఉండరు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి ప్రథమ చికిత్స అందించి, వారి ప్రాణాలను కాపాడే మొదటి సంజీవని మన గ్రామంలో ఉండే గ్రామీణ వైద్యులు ఆర్.ఎం.పి మరియు పి.ఎం.పి కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా తమ ప్రాణాలను పణంగా పెట్టి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించిన ఘనత మనది. కానీ ఈరోజు మన పరిస్థితి ఏంటి? ప్రతిరోజు భయం భయంగా బతకాల? చట్టబద్ధత లేదని నేపంతో మనల్ని ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు న్యాయం? ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ నాయకులు మన దగ్గరకు వచ్చి మన ఓట్లు కావాలి మన మద్దతు కావాలి అప్పుడు మెనీఫెస్టోలో గ్రామీణ వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం సర్టిఫికెట్లు జారీ చేస్తాం మిమ్మల్ని ఆదుకుంటాం అని పెద్దపెద్ద హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీలు ఏమయ్యాయి ? మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేర్చే వరకు మనమంతా కలిసికట్టుగా పోరాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు అందరూ పాల్గొన్నారు.

# ఋషీ పంచమి వేడుకల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ

**బజారత్నూర్ అక్టోబర్ 01 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని చందునాయక్ తాండ గ్రామంలో ప్రతీ ఏటా భారీ ఎత్తున జరిగే మథుర సమాజ్ ఋషీ పంచమి వేడుకలకు గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహారాజ్‌ల ఆశీర్వాదం తీసుకొని వారిని సన్మానించారు. మథుర సమాజానికి ఋషి పంచమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# షెడ్యూల్డ్ తెగల జాబితా నుండి లంబాడాలను తొలగించుటకు ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయాలి

**1/70 చట్టాన్ని పరిరక్షించాలి**

**తుడుం దెబ్బ జాతీయ ప్రధా న కార్యదర్శి రమణాల లక్ష్మ య్య**

**గుడిహత్నూర్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని ఆదివాసి విజ్ఞాన కేంద్రంలో ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి అధ్యక్షతన ఈ నెల 14న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద ఆదివా సి ఆత్మ ఘోష మహా ధర్నా విషయమై జరిగిన ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొని చలో హైదరాబాద్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమ ణాల లక్ష్మయ్య మాట్లాడుతూ తెలంగాణలో ఆదివాసి జాతి ఉనికికే ప్రమాదం వచ్చింది. 200 ఏళ్ల బ్రిటిష్ వారితో పోరాడి 1874లో ఏజెన్సీని, 1917లో భూమి పై హక్కును, 1950లో 5వ షెడ్యూల్ ను సాధించుకున్నాం. మారక్షణ కోసం 1/5 9, 1/70 చట్టాలు వచ్చాయి. కానీ 1976లో లంబా డాలను ఎస్టీ జాబితాలో కలపడం మాకు శాపంగా మా రింది. అప్పటి నుండి ఏజెన్సీలో ఆదివాసులు 65% భూములు, 29 శాఖల్లో 90% ఉద్యోగాలు కోల్పో యారు. ఇప్పుడు 1/70 చట్టాన్ని కూడా సుప్రీంకోర్టులో 1700 మంది గిరిజ నేత రులు సవాల్ చేసి మమ్మల్ని ఏజెన్సీ నుండి తరిమేసే కుట్ర చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే కౌంటర్ పిటిషన్ వేయాలి అని డిమాండ్ చేశారు.ఏజెన్సీలో100% ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలని, 8 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఎస్టీ జాబితా



నుండి లంబాడాలను తొల గించడానికి ప్రత్యేక కమీషన్ వేయాలని ఈ డిమాండ్స్ తో ఈ నెల 14న హైదరా బాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను ఉమ్మ డి ఆదిలాబాద్ నుండి ఉ మ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం వరకు ఉన్న ప్రతి ఆదివాసి బిడ్డ విజయవం తం చేయాలి." అని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన తెలంగాణ రా ష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి, తుడుం దెబ్బ జాతీయ కార్యదర్శి పో డెం కృష్ణ ప్రసాద్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వట్టం కన్నయ్య, ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటే ల్, ఆదివాసి రైతు సేన జిల్లా అధ్యక్షులు వేద్మ చంపత్ రావు, ఆదివాసి సేన రాష్ట్ర నాయకులు తోడషం భూమ పటేల్, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు మేస్రం మోహన్, ఆదివాసి నాయకులు ఉర్వేత రోహిత్ ఆదివాసి విద్యార్థి సేన జిల్లా అధ్యక్షులు కోట్నక గణేష్, ఆదివాసి సేన నాయకులు మేస్రం మారు, నైతం సాయి , కినక రాంజీ ఆదివాసి సేన, తుడుం దెబ్బ ,విద్యార్థి సంఘాల నాయకులు పా ల్గొన్నారు.

# 14న చలో హైదరాబాద్

## ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నాను విజయవం తం చేయాలి

### జాతీయ ప్రధాన కార్యదర్శి రమణా లక్ష్మయ్య



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 1,(ప్రజా జ్యోతి)** తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఈ నెల 14 న నిర్వహించ నున్న చలో హైదరాబాద్ ఆ దివాసీల ఆత్మఘోష మహా ధర్నాను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమ ణాల లక్ష్మయ్య పిలుపు నిచ్చారు. గురువారం ఆదివా సీ సంఘాల జేఏసీ, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న "ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా" కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా రమణాల లక్ష్మయ్య,తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అక్టోబర్ 14,న నిర్వహించ నున్న చలో హైదరాబాద్ --- ఆదివాసీల ఆత్మఘోష మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ మహాధర్నాలో ప్రధానంగా నాలుగు డిమాండ్ల పై ప్రభుత్వాన్ని కోరుతు న్నట్లు తెలిపారు. 1/70 చట్టంపై గిరిజనేతరులు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన కేసు పై ప్రభుత్వం వెంటనే ఆది వాసీల పక్షాన కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని, లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించేందుకు వెంటనే ప్రత్యేక కమిషన్ ఏర్పా టు చేయాలనీ,జీవో నెంబర్ 3 స్థానంలో కొత్త జీవో తీసు కురావడానికి ఆదివాసీ ఎమ్మెల్యేలు ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఆదివాసీలు సాగు చేస్తున్న ఎనిమిది లక్షల ఎకరాల పోడు భూము లకు పట్టాలు ఇవ్వాలని,14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ నున్న ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా కార్యక్రమాన్ని విజ యవంతం చేయడానికి ఆది లాబాద్ నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లా వరకు ఉన్న ఆదివాసీ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆదివాసీ సంఘాల జేఏసీ, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నాయ కులు తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్, పొదేం కృష్ణ ప్రసాద్ -- తుడుం దెబ్బ జాతీయ కార్య దర్శి, వట్టం కన్నయ్య -- తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,ఆర్క శేషారావు -- తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి, గోడం రేణుక ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శి, ఉయిక ఇందిరా ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం గణపతి తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా డి విజన్ అధ్యక్షులు వెడ్మా ము కుందరావు -- తుడుం దెబ్బ మావల మండల అధ్యక్షుడు, మెస్రం కేశవరావు -- తుడుం దెబ్బ ఆదిలాబాద్ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వాస్తవ లాభాలు ప్రకటించి కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలి

**పీఎల్ఆర్ బోనస్ రూ.1.15 లక్షలకు పెంచాలి**

**శ్రీరాంపూర్ ఏరియా జీఎంకు టీఎన్టీయూసీ వినతి**



**మంచిర్యాల, 1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, అందులో 40 శాతం వాటాను కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టీఎన్టీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. దీపావళికి ముందు చెల్లించే ప్రాఫిట్ లింక్డ్ రివార్డ్ (పీఎల్ఆర్) బోనస్‌ను రూ.1.15 లక్షలకు పెంచి అందించాలని కోరారు. ఈ మేరకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి శ్రమతోనే సంస్థ ప్రగతి సాధిస్తోందని పేర్కొన్నారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి 60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించగా, 58 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించిందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే లాభాలను ప్రకటించి, కార్మికులకు చెల్లించే వాటాను ఖరారు చేయడంతోపాటు చెల్లింపు తేదీని వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేల లాభాల వాటా చెల్లించారని, ఈసారి కూడా వారికి శాశ్వత కార్మికులతో సమానంగా లాభాల వాటా అందించాలని కోరారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26,000కు తగ్గకుండా వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో అమలు చేస్తున్న విధంగా సింగరేణిలోనూ ఫస్ట్ కేటగిరీ వేతనం చెల్లించాలని, సీపీఆర్ఎంఎస్ వైద్య పథకంలో అధికారులు, కార్మికుల మధ్య వ్యత్యాసం లేకుండా రూ.25 లక్షల వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. రిటైర్డ్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. భూగర్భ గనులు, ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన పనిముట్ల కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని నాయకులు తెలిపారు. మైన్స్ కమిటీ ద్వారా సమస్యను పరిష్కరించి, కార్మికులకు తక్షణమే అవసరమైన పనిముట్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కొల్ బెల్ట్ ప్రాంత ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించి, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే టీఎన్టీయూసీ ఆధ్వర్యంలో అన్ని ఏరియా జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరామ్ సింగ్, ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు, ఎస్సీఎల్‌యూ నాయకులు తలారి రాజు, కుండి శ్రీనివాస్, పార్లమెంట్ ఆర్గనైజర్ గజ్జెల దుర్గయ్య, ఎం.డి. అన్వర్, రాజబాబు, ఎన్. పుల్లయ్య, ఎ. రాజనర్సు, అంకులు, పేదల, టి. మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

# మురిమడుగు గ్రామస్తులపై అటవీ శాఖ అధికారుల వేధింపులు ఆపాలి





జాన్సన్ నాయక్

**జన్నారం,అక్టోబర్1(ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు గ్రామంలో అటవీశాఖ ట్రెంచ్ హద్దుల వివాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ అండగా నిలిచారు.గురువారం మురిమడుగు గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత గ్రామస్తులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్లుగా గ్రామంలో నివాసం ఉంటూ తమ జీవనాధారమైన భూముల్లో సాగు చేసుకుంటున్న పేద రైతు కుటుంబాలకు అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అటవీ భూమిలోకి ప్రవేశం లేదంటూ జేసీబీలతో ట్రెంచ్లు ఏర్పాటు చేసి హద్దులు నిర్ణయించే చర్యలపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి జాన్సన్ నాయక్ మాట్లాడుతూ... పేదల జీవనాధారమైన భూముల విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవడం సరికాదని, ఏళ్లుగా అక్కడే నివసిస్తూ వ్యవసాయం చేసుకుంటున్న కుటుంబాల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా ఎలాంటి బలవంతపు చర్యలకు పాల్పడకూడదని అటవీశాఖ అధికారులను డిమాండ్ చేశారు.గ్రామస్తుల హక్కులు, వారి జీవనాధారం కాపాడే విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, మురిమడుగు గ్రామస్తుల సమస్య పరిష్కారం అయ్యే వరకు వారి తరఫున చట్టబద్ధంగా పోరాడుతామని జాన్సన్ నాయక్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్, ఫజల్ ఖాన్,అభిలాశ్, దేవన్న,శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును హరిస్తే సహించేది లేదు

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి

ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల తొలగింపును నిలిపివేయాలి

వామపక్ష పార్టీల నాయకులు




**మంచిర్యాల, 1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో ఓటర్ల జాబితాల నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నిరసన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పైళ్ల అశయ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎన్నికల వ్యవహారాల అధికారి (ఏఓ) దేశ్ పాండే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘమే, ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ప్రజల్లో ఆందోళన కలిగించే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించినట్లు నివేదికలు వెలువడ్డాయని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ఏ రాజకీయ పార్టీకి చెందిన ఆస్తి కాదని, అది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టం చేశారు. ఆ హక్కును హరించే ఏ చర్యనైనా వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తాయని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అనేక అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘంలోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గత పది నెలల్లో 14 సందర్భాల్లో అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికలు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిర్ణయాల విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు. ఎన్నికల సంఘం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే తొలగించిన పేర్లకు సంబంధించిన వివరాలను బహిరంగపరచాలని, ప్రతి ఓటరుకు తన అభ్యంతరాన్ని నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల సవరణపై తలెత్తిన సందేహాలను నివృత్తి చేసి, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్యలను అడ్డుకుంటామని, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించాలని, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే చట్టపరమైన విచారణలో బాధ్యత లేదా నేరం నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, బొడెంకి చందు, గోమాస ప్రకాష్, టి. శ్రీనివాస్, మేకల రాములు, లింగం రవి, ఖలీందర్ అలీఖాన్, బ్రహ్మానందం అరుణ, మల్లన్న, దొంద ప్రభాకర్, దూంపల రంజిత్ కుమార్, మిట్టపల్లి పోలు, వనం సత్యానారాయణ, మామిడి గోపి, అశోక్, కౌన్సిలర్ మద్దెల శంకర్, దేవి పోచన్న, ఎగుడ మొండి, కొత్తపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష సర్పంచులను ఇబ్బంది పెడితే సహించం

: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



**బెజ్జూర్01అక్టోబర్(ప్రజా జ్యోతి):** ప్రజలచే ఎన్నికైన ప్రతిపక్ష పార్టీల కు చెందిన సర్పంచులను అభివృద్ధి పనులు చేపట్టకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హెచ్చరించారు.మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కోనేరు కోనప్ప మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలు ఎన్నుకున్న సర్పంచులకు అధికారులు సహకరించాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే కొంతమంది అధికారులు కావాలనే అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్లను పెండింగ్‌లో ఉంచుతున్నారని, పనులు పూర్తయినప్పటికీ బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. సర్పంచులు ఏ పార్టీకి చెందిన వారైనా ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులేనని కోనేరు కోనప్ప గారు అన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచులను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులకు ఆటంకాలు సృష్టిస్తే ప్రజల తరఫున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కోనప్ప గారు పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సర్పంచులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యకర్తలు ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల తరఫున పోరాడాలని కోనేరు కోనప్ప పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, కోనప్ప అభిమానులు తదితరులు పాల్గొన్నారు.....

## రక్తదానం చేసి.. ప్రాణదాతలుగా నిలవండి

కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి** అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మట్‌తో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న వారికి సకాలంలో రక్తం అందితే ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంతోపాటు సమాజానికి సేవ చేసినట్లవుతుందని తెలిపారు. రక్తదానంపై యువతలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకట్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**ఆస్తులు బదలాయించిన తర్వాత నిర్లక్ష్యం చేస్తే చర్యలు.. చట్టాలపై అవగాహన అవసరం**

**జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఘనగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం**

**అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**








**మంచిర్యాల,1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** వయోవృద్ధులు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. తల్లిదండ్రులు తమ ఆస్తులు, భూములను పిల్లలకు బదలాయించిన అనంతరం నిర్లక్ష్యానికి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆస్తిపాస్తులు లేని వయోవృద్ధులను సైతం పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో వయోవృద్ధుల అనుభవాలు, సలహాలు, సూచనలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. వయోవృద్ధులు సమాజానికి విలువైన సంపద అని, కుటుంబానికి పెద్దలుగా వారు అందించే మార్గదర్శకత్వం భావితరాలకు ఉపయోగపడుతుందని అన్నారు. వయోవృద్ధుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయోవృద్ధుల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా ముఖ్యమని, వారు క్రమం తప్పకుండా నడక, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలను కొనసాగించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలు, సంక్షేమ పథకాల ద్వారా వయోవృద్ధులకు రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చట్టాల అమలుతో పాటు గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో సుమారు 35,250 మంది వయోవృద్ధులు వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారని, ప్రతి నెలా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై అవగాహన కల్పించి తగిన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం--2007లోని నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం, నిర్దిష్ట షరతులకు లోబడి వయోవృద్ధులు తమ ఆస్తులను ఇతరులకు బదలాయించిన సందర్భాల్లో ఆ బదలాయింపును రద్దు చేసే అవకాశం ఉందని వివరించారు. సెక్షన్ 24 ప్రకారం వయోవృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే నిబంధనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన సందర్భాల్లో నిబంధనలకు అనుగుణంగా వారి జీతం నుంచి తల్లిదండ్రుల పోషణకు చెల్లింపులు చేయించే అవకాశం ఉంటుందని తెలిపారు. చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించిన వారిపై జరిమానా, శిక్ష వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు. వయోవృద్ధులు తమకు కల్పించిన చట్టపరమైన హక్కులను తెలుసుకుని, అవసరమైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి మంగళవారం డే కేర్ సెంటర్లలో వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వయోవృద్ధులకు ఏవైనా సమస్యలు ఎదురైతే సహాయం కోసం 14567 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వయోవృద్ధులను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులు, పలువురు వయోవృద్ధులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఏరియాలో సెప్టెంబర్‌లో 99 శాతం బొగ్గు ఉత్పత్తి

**మూడు భూగర్భ గనులు, ఒక ఓపెన్‌కాస్ట్‌లో వంద శాతం లక్ష్య సాధన**

**మిగిలిన ఆరు నెలల్లో వార్షిక లక్ష్యాన్ని అధిగమిస్తాం**

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**




**మంచిర్యాల, 1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో సెప్టెంబర్ మాసంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పరంగా సంతృప్తికరమైన ఫలితాలు సాధించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ గురువారం తెలిపారు. సెప్టెంబర్ నెలలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 99 శాతం సాధించామని, మిగిలిన ఆరు నెలల్లో ఉత్పత్తిని మరింత పెంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సర వార్షిక లక్ష్యాలను వంద శాతం రక్షణతో కూడిన ఉత్పత్తి ద్వారా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలో సెప్టెంబర్ నెలకు 4.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా, 4,07,215 టన్నుల ఉత్పత్తితో 99 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు జీఎం వెల్లడించారు. ఇందులో ఎస్ఆర్పీ-1 గని 106 శాతం, ఆర్కే-7 గని 101 శాతం, ఆర్కే ఎన్‌టీ గని 107 శాతం ఉత్పత్తి సాధించాయని తెలిపారు. ఆర్కే-5 ఇంక్లైన్, ఐకే-1ఏ, ఎస్ఆర్పీ-3, 3ఏ గనులు లక్ష్యానికి స్వల్ప దూరంలో నిలిచాయని అ న్నారు. ఏరియాలోని భూగర్భ గనులకు సెప్టెంబర్ నెలలో 1.20 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా, 1,14,470 టన్నుల ఉత్పత్తితో 95 శాతం సాధించినట్లు తెలిపారు. మరోవైపు ఎస్ఆర్పీ ఓపెన్‌కాస్ట్‌లో రెండు ప్రైవేటు ఓవర్‌బర్డెన్ (ఓబీ) కాంట్రాక్టులు సమర్థవంతంగా పనిచేయడంతో 114 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిందన్నారు. ఐకే ఓపెన్‌కాస్ట్‌లో కొత్త కాంట్రాక్టు ప్రారంభం కావడంతో సెప్టెంబర్‌లో 44 శాతం ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. మొత్తంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ గనులకు 2.90 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా, 2,92,745 టన్నుల ఉత్పత్తితో 101 శాతం లక్ష్యాన్ని సాధించడం సంతోషకరమన్నారు. అక్టోబర్ నుంచి మిగిలిన ఆరు నెలల్లో భూగర్భ, ఉపరితల గనుల్లో ఉత్పత్తి, ఉత్పాదకతను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను సాధించేందుకు సమష్టిగా కృషి చేస్తామన్నారు.

**వారసులకు 3,868 డిపెండెంట్ ఉద్యోగాలు**

శ్రీరాంపూర్ ఏరియాలో మెడికల్ ఇన్వాలిడేషన్‌కు గురైన ఉద్యోగుల వారసుల్లో ఇప్పటివరకు 3,868 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించినట్లు జీఎం తెలిపారు. 320 మంది ఉద్యోగులకు ఎల్ఎస్పీ (ఎల్ ఎస్ పి ), మరో 14 మందికి ఎంఎంసీ (ఎం ఎం సి) చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగ విరమణ పొందిన 9,795 మంది ఉద్యోగులకు ఇప్పటివరకు సీపీఆర్ఎంఎస్ (సి పి ఆర్ ఎం ఎస్ ) కింద మెడికల్ కార్డులు అందజేసినట్లు వివరించారు.

# మొదటి అర్థ సంవత్సరంలో బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో సింగరేణి ముందంజ

## గత ఆర్థిక అర్థ సంవత్సరం కన్నా బొగ్గు రవాణాలో 4 శాతం, ఓవర్ బర్డెన్ తొలగింపులో 11 శాతం వృద్ధి

## గత ఏడాది కన్నా తెలంగాణ జెన్ కో కు అధికంగా బొగ్గు సరఫరా

## సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి







**మంచిర్యాల, 1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మొదటి అర్థ సంవత్సరంలో బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో సింగరేణి ముందంజలో ఉన్నాదని ,సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ముగిసిన తొలి ఆర్థిక అర్థ సంవత్సరంలో సింగరేణి సంస్థ బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో గణనీయమైన వృద్ధిని సాధించిందని సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి గురువారం తెలిపారు . గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి సింగరేణి సంస్థ 287.6 లక్షల టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేయగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్థ సంవత్సరంలో గతానికన్నా 4 శాతం వృద్ధితో 299.4 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసింది. అంతే కాకుండా గత ఏడాది తొలి అర్థ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 159.1 లక్షల టన్నుల రవాణా చేసిన సింగరేణి ఈ సారి రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు రాష్ట్ర అవసరాలకు పెద్దపీట వేస్తూ 198.2 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయడం గమనార్హం. ఇది గత ఏడాది సరఫరా చేసిన బొగ్గు పరిమాణం కన్నా 24.58 శాతం ఎక్కువ. దీనిని బట్టి సింగరేణి సంస్థ రాష్ట్ర విద్యుత్ అవసరాలపై అధిక ప్రాధాన్యత ఇస్తుందని అర్థం అవుతుంది. థర్మల్ విద్యుత్ కేంద్రాల వారీగా చూసినట్లయితే కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి గత ఏడాది తొలి ఆర్థిక సంవత్సరంలో 26.4 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయగా, ఈ ఏడాది తొలి ఆర్థిక సంవత్సరంలో 39.8 లక్షల టన్నుల బొగ్గును 50.76 శాతం వృద్ధితో రవాణా చేయడం గమనార్హం. అలాగే యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి గత ఏడాది ఇదే కాలానికి 21.5 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయగా ఈ ఏడాది 33.9 లక్షల టన్నుల రవాణాను 57.67 వృద్ధితో రవాణా చేసింది. మణుగూరు లోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కు గత ఏడాది 19.5 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిన సింగరేణి ఈ ఏడాది 24.4 లక్షల టన్నుల బొగ్గును 25.13% వృద్ధితో రవాణా చేయడం జరిగింది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 27.27 శాతం వృద్ధితో 26.6 లక్షల టన్నుల బొగ్గును సింగరేణి రవాణా చేసింది. అలాగే ఎన్.టి.పి.సి విషయానికొస్తే ఎన్.టి.పి.సి తెలంగాణ ప్లాంట్ కు గత ఏడాది ఇదే సమయానికి 19.4 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయగా ఈ ఏడాది 25.3 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయటం జరిగింది ఇంకా ఎన్.టి.పి.సి రామగుండం ప్లాంట్ కు పోయిన ఏడాది సెప్టెంబర్ చివరికల్లా 43.5 లక్షల టన్నులు సరఫరా చేయగా ఈ ఏడాది 42.7 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసింది.

**రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆదేశాలతో ప్రత్యేక చర్యలు**

ఎల్ నినో పరిస్థితుల కారణంగా సింగరేణి సంస్థ రాష్ట్ర విద్యుత్ అవసరాలకు పెద్దపీట వేయాలని విద్యుత్ సంస్థలతో సమన్వయం జరుపుతూ, విద్యుత్ ప్లాంట్ లకు కావాల్సిన బొగ్గును శక్తి మేర సరఫరా చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆదేశాలతో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిని, రవాణాని పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రతినిత్యం సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడుతూ ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు, బొగ్గు రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సజావుగా రవాణా జరపడం కోసం ఐదుగురు ఉన్నతాధికారులకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలను అప్పగించి పర్యవేక్షిస్తున్నారు. సింగరేణి సంస్థ బొగ్గు అమ్మకాన్ని వ్యాపార దృక్పథంతో కాకుండా రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడమే నైతిక కర్తవ్యంగా భావిస్తూ స్వరాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎక్కువ శాతం బొగ్గును రవాణా చేస్తోంది. ఈ వివరాలను తెలియజేస్తూ సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఏడాదికి నిర్దేశించిన 620 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 650 లక్షల టన్నుల బొగ్గు రవాణా సాధించడానికి పూర్తి ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నట్లు వివరించారు.

# రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాలలో ప్రాణాలు కాపాడవచ్చు

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల, 1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాలలో ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ– మంచిర్యాల జిల్లా రక్త నిధి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా తలసేమియా, సికిల్ సెల్, రక్తహీనత వంటి వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు ప్రమాదాలలో గాయపడి అత్యవసరంగా రక్తం కావలసి ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్త నిధి కేంద్రానికి రక్తదాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు, సింగరేణి సంస్థ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల యాజమాన్యాలు, స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వాహకులు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తాన్ని అందిస్తూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేక మంది ప్రాణాలను కాపాడటంలో రక్తదాతల సహకారం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, రక్తదానం ద్వారా అత్యవసర సమయంలో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అనంతరం అత్యధిక సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన రక్తదాతలు, ప్లేట్లెట్స్ దానం చేసిన స్వచ్ఛంద రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా ప్రతినిధులు, సిబ్బంది, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

**కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి వాస్తవ లాభాల్లో 36 శాతం వాటా ప్రకటించాలి**

**తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబీజీకేఎస్) నాయకులు శ్రీరాంపూర్ ఓసీలో టిబీజీకేఎస్‌లోకి 23 మంది కార్మికుల చేరిక**

**మంచిర్యాల, 1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల ఎన్నికల గడువు ముగిసినందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు జరిగే వరకు రిజిస్టర్డ్ కార్మిక సంఘాలన్నింటికీ సమాన హోదా కల్పించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబీజీకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌లో గురువారం ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, టిబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్ఎల్‌సీ, సింగరేణి యాజమాన్యం జారీ చేసిన ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు. గత ఎన్నికల ముందు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ అంశాలపై ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పకుండా టిబీజీకేఎస్, బీఆర్ఎస్‌పై చౌకబారు ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. కార్మికులు అన్ని విషయాలను గమనిస్తున్నారని, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో తగిన సమాధానం చెబుతారని అ న్నారు. విదేశీ బొగ్గు దిగుమతులపై అభ్యంతరం...తెలంగాణలోని విద్యుత్ ప్లాంట్లకు సరిపడా బొగ్గు నిల్వలు లేవంటూ విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలనే ప్రచారం జరుగుతున్నా గుర్తింపు సంఘాలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. సింగరేణిలో జీ-9 గ్రేడ్‌కు చెందిన బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ విదేశీ బొగ్గు దిగుమతులకు ప్రాధాన్యమివ్వడం వెనుక ఉద్దేశమేమిటని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల సింగరేణి ప్రైవేటీకరణ దిశగా వెళ్తోందని వారు ఆరోపించారు. సింగరేణి పరిశ్రమను కాపాడుకోవడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు భవిష్యత్తులో చేపట్టే పోరాటాలకు ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. గతంలో వారసత్వ ఉద్యోగాల విషయంలో ఏఐటీయూసీ అనుసరించిన వైఖరిని వారు విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ ద్వారా సుమారు 15 వేల మంది యువకార్మికులకు, ఎక్స్‌టర్నల్ నియామకాల ద్వారా మరో ఆరు వేల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌లో ప్రైవేట్



సర్ఫేస్ మైనర్‌కు స్వాగతం పలకడం, సింగరేణిలో స్కూల్ బస్సులు, జీపులు, అంబులెన్సులు, క్యాంటీన్ల వంటి సేవలను ప్రైవేటీకరించేందుకు గతంలో తీసుకున్న నిర్ణయాలపై జాతీయ కార్మిక సంఘాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక సర్క్యులర్లను ఉపసంహరించాలన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో కార్మికులకు ఇబ్బందులు కలిగించే సర్క్యులర్లు జారీ అవుతున్నా గుర్తింపు సంఘాలు స్పందించడం లేదని టిబీజీకేఎస్ నాయకులు ఆరోపించారు. మెడికల్ బోర్డు విధానాలు, మస్టర్ల సంఖ్యలో మార్పులు, పీరియాడికల్ మెడికల్ ఎగ్జామినేషన్ (పీఎంఈ) గడువును తగ్గించడం వంటి అంశాలపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానాల కారణంగా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యాజమాన్యం తీసుకునే నిర్ణయాలను గుర్తింపు సంఘాలు ప్రశ్నించాలని కోరారు. టిబీజీకేఎస్ గతంలో అధికారంలో ఉన్న సమయంలో పీఎంఈ, స్పోర్ట్స్ మస్టర్, వృత్తి పన్ను రద్దు, మ్యాచింగ్ గ్రాంట్, తెలంగాణ ఇంక్రిమెంట్, జీతంలో ఒక శాతం ఎలక్ట్రికల్ ఛార్జీల రద్దు, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్య సదుపాయం, ఏసీ సౌకర్యం, గృహ నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీ లేని రుణం, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థల్లో చదివే కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, అంబేద్కర్ జయంతి సెలవు, ఆప్షనల్ హాలిడేలు సహా 72 హక్కులను సాధించామని నాయకులు తెలిపారు. ఏఐటీయూసీ 24 డిమాండ్లపై ఒప్పందం కుదుర్చుకున్నామని చెబుతున్నప్పటికీ, అదే రోజు ఇద్దరు మైనింగ్ సూపర్‌వైజర్లకు మెడికల్ బోర్డు ద్వారా అండర్‌గ్రౌండ్ అన్‌ఫిట్, ఫిట్ ఫర్ జనరల్ అసిస్టెంట్‌గా నిర్ణయాలు ఇచ్చారని విమర్శించారు. ఆ 24 డిమాండ్లకు సంబంధించిన 12(3) ఒప్పందాన్ని కార్మికులకు చూపించాలని డిమాండ్ చేశారు. గనుల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు .గనులు, డిపార్ట్‌మెంట్లలో కార్మికులు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని



నాయకులు వివరించారు . కార్మికులకు అవసరమైన పీపీఈ కిట్లు, కోల్ కట్టర్, టింబర్‌మెన్‌కు అవసరమైన బిట్లు, రాడ్లు, లైన్‌మెన్ కీలులు, సిమెంట్, రెజిన్ క్యాప్సూల్స్, ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలకు అవసరమైన విడిభాగాలు, లూబ్రికేటింగ్ ఆయిల్స్, ఇతర పనిముట్ల సరఫరాలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ఈ సమస్యలను గుర్తింపు సంఘాలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు .రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని టిబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా సంస్థ వాస్తవ లాభాలను ప్రకటించకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. వెంటనే వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 36 శాతం లాభాల వాటా చెల్లించాలని కోరారు. టిబీజీకేఎస్ పోరాటాలకు ఆకర్షితులై శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌లో పనిచేస్తున్న వివిధ కార్మిక సంఘాలకు చెందిన గొపతి మల్లేష్, గడ్డం శ్రీనివాస్, పెద్దపల్లి బుచ్చయ్యతో పాటు మొత్తం 23 మంది కార్మికులు టిబీజీకేఎస్‌లో చేరారు. ముఖ్య అతిథులు వారికి సంఘం కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జాయింట్ సెక్రటరీ పొగాకు రమేష్, సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి, సీనియర్ నాయకుడు మాదరాపోయిన గట్టయ్య, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.డి. లాలా, ఫిట్ సెక్రటరీ గడ్డం సుధాకర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ జంగా రమేష్, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి వెంగళ కుమార్ స్వామి, సీనియర్ నాయకులు నీలం సదయ్య, రామిడి మహేందర్ రెడ్డి, మహిళా కార్మిక నాయకురాళ్లు హేమలత, స్రవంతి, రామగిరి సంపత్, బుర్ర శ్రీనివాస్, సదానందం, క్రాంతి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, నక్క కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

**వివిధ రంగాల్లో సేవలందించిన వయోవృద్ధులకు ఆత్మీయ సన్మానం**

**మంచిర్యాల, 1,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు వయోవృద్ధులకు పూల బొకేలు అందజేసి, శాలువాలతో ఆత్మీయంగా సన్మానించారు. వయోవృద్ధులందరికీ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, వయోవృద్ధులు మన జీవితాలకు మూలస్తంభాలని, కుటుంబాలకు జీవన వృక్షాలని, మన సంస్కృతికి నిలువెత్తు రూపాలని కొనియాడారు. వృద్ధాప్యం అనేది జీవితానుభవం, త్యాగం, జ్ఞానం, జ్ఞాపకాలతో నిండిన అందమైన దశ అని పేర్కొన్నారు. చిన్నతనంలో మనల్ని చేతుల్లో ఎత్తుకొని పెంచిన చేతులు, మన ఆకలి తీర్చేందుకు తమ ఆకలిని సైతం మరిచిన హృదయాలు తల్లిదండ్రులవని గుర్తు చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం తమ సుఖాలను త్యాగం చేసిన గొప్ప త్యాగమూర్తులు తల్లిదండ్రులని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రేమ, ఆదరణ, ఆప్యాయతల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. భావిభారత పౌరులు తల్లిదండ్రులకు ఖరీదైన బహుమతులు ఇవ్వడం కంటే, వారితో కొద్దిసేపు ప్రేమగా మాట్లాడటం, ఓపికగా వారి మాటలు వినడం, ఆప్యాయంగా పలకరించడం ఎంతో విలువైనవని సూచించారు. వయోవృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ప్రేమాభిమానాలు చూపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా "తల్లిదండ్రులను ఆదరించండి.. ఆప్యాయంగా పలకరించండి.. అనాథాశ్రమాల్లో చేర్పించకండి.. వయోవృద్ధుల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో



సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఏ. గంగయ్య, నాయకులు ఏ. అంజన్న, రాజా గౌడ్, పోతురాజుల చంద్రయ్య, ఏ. రాజేశం, జి. లక్ష్మణ్, జి. నారాయణ, బి. జ్ఞాని తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘాలు విఫలం

**మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు**

**మంచిర్యాల, 1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘాలు విఫలం అయ్యాయని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విమర్శించారు . శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిపై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్ అనంతరం కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘమైన ఐఎన్‌టీయూసీ నుంచి పలువురు కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు కార్మికులతో సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. అనంతరం టీబీజీకేఎస్‌లో చేరిన కార్మికులకు కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు కార్మిక సంఘాలు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని విమర్శించారు. నెలకు రెండు లేదా మూడు సార్లు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని హామీ ఇచ్చి, 17 నెలల్లో నామమాత్రపు బోర్డులు మాత్రమే నిర్వహించి కేవలం 50 మందిని ఇన్వాలిడేట్ చేశారని ఆరోపించారు. గత నెల 27న వెలువడిన మెడికల్ బోర్డు ఫలితాలు దారుణంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు విధులకు హాజరయ్యే సమయంలో అవసరమైన యూనిఫాం, రేడియం జాకెట్, సాక్స్, షూస్, గాగుల్స్, గ్లౌజులు, హెల్మెట్ ఉచితంగా అందించడం యాజమాన్యం బాధ్యత అని అన్నారు. వాటిని అందిస్తామని కొత్తగా అగ్రిమెంట్లు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సంవత్సరానికి 12 వేల మందికి కూడా నిర్వహించలేని పీరియాడికల్ మెడికల్ ఎగ్జామినేషన్స్ (పీఎంఈ)ను ఏటా 40 వేల మందికి నిర్వహిస్తామని ఆగస్టు 28న సర్క్యులర్ జారీ చేయడంపై ఆయన ప్రశ్నించారు. తగిన మౌలిక సదుపాయాలు, వైద్యులు లేకుండా పరీక్షలు



నిర్వహించి కార్మికులను అన్‌ఫిట్‌గా ప్రకటిస్తే వారి పరిస్థితి ఏమిటని నిలదీశారు. అన్‌ఫిట్‌గా ప్రకటించిన కార్మికులు తిరిగి ఫిట్ అయ్యే వరకు స్పెషల్ లీవ్ లేదా సర్ఫేస్ ఉద్యోగం కల్పించి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 150 కంటే తక్కువ మస్టర్లు నమోదైతే ఏడాదికి రెండు ఇంక్రిమెంట్లు కట్ చేయడం, రెండేళ్లు మస్టర్లు లేకపోతే లోయర్ గ్రేడ్‌కు మార్చడం, మూడేళ్లు లేకపోతే ఉద్యోగం నుంచి తొలగించడం వంటి నిబంధనలతో కూడిన సర్క్యులర్‌ను గుర్తింపు సంఘాలు ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. మారుపేర్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, పదో తరగతి రెగ్యులర్‌గా ఉత్తీర్ణులు కాని కార్మికులపై యాజమాన్యం విజిలెన్స్ కేసులు నమోదు చేసి వేధిస్తుంటే, గుర్తింపు సంఘాలు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. కార్మికులకు లాభాల వాటా పెంపుపైనా యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని అన్నారు. గతంలో మూడు శాతం కూడా పెంచని వారు ఇప్పుడు ఎంత మేరకు లాభాల వాటా పెంచుతారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత రెండేళ్లలో సంస్థ అభివృద్ధి పేరుతో కేటాయించిన రూ.6,323 కోట్ల నిధుల వినియోగంపై యాజమాన్యం స్పష్టమైన లెక్కలు వెల్లడించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీబీజీకేఎస్ నాయకత్వంలో సింగరేణి కార్మికులకు పలు సంక్షేమ పథకాలు సాధించామని దివాకర్‌రావు గుర్తుచేశారు. 13 వేల కారుణ్య నియామకాలు, ఉద్యోగం వద్దనుకునే వారికి రూ.25 లక్షల ప్యాకేజీ, ఐఐటీ, ఐఐఎంలలో చదివే కార్మికుల



పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, సొంత ఇంటి స్థలం లేని వారికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం, ఒక శాతం ఎలక్ట్రిక్ ఛార్జీల రద్దు, ఉచిత ఏసీ సౌకర్యం, మహిళా కార్మికులకు చైల్డ్ కేర్ లీవ్ (సీసీఎల్), ప్రసూతి సెలవులు, తల్లిదండ్రులకు కార్పొరేట్ తరహాలో ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు వంటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి సెప్టెంబర్ 8తో ముగిసిందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ టీబీజీకేఎస్ తరఫున హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. ఈ పిటిషన్ 14వ కోర్టులో 91వ నంబరు కేసుగా విచారణకు రానుందని తెలిపారు. కోర్టు ద్వారా ఎన్నికలు సాధించి, గులాబీ జెండాతో కార్మికులకు అండగా నిలుస్తామని అ న్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, ఇతర టీబీజీకేఎస్ నాయకులు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులను ప్రతి ఒక్కరూ తమ ఇంటి పెద్దలుగా భావించి గౌరవించాలి

**వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**వయోవృద్ధులకు మెరుగైన వైద్య సేవలు, అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**మంచిర్యాల ఆనంద్ నిలయం రెడ్‌క్రాస్ వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం..**

**చట్టాలపై అవగాహన**

**మంచిర్యాల, 1, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలోని ఆనంద్ నిలయం రెడ్‌క్రాస్ వృద్ధాశ్రమంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ న్యాయమూర్తి శ్రీమతి కవిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి ఈ శిబిరాన్ని ప్రారంభించి వృద్ధుల ఆరోగ్య పరిస్థితులు, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల లయన్స్ క్లబ్‌కు చెందిన మధుసూదన్ రెడ్డి, ఆయన బృందం, రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన మహేందర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో సుమారు 25 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీనియర్ న్యాయమూర్తి కవిత నేతృత్వంలోని న్యాయ సేవాధికార సంస్థ బృందం వయోవృద్ధులకు సంబంధించిన చట్టాలు, హక్కులు, వారికి అందుబాటులో ఉన్న న్యాయ సేవలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వయోవృద్ధులను ప్రతి ఒక్కరూ తమ ఇంటి పెద్దలుగా భావించి




గౌరవించాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వయోవృద్ధులకు ప్రాధాన్యతనిస్తూ త్వరగా వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. తల్లిదండ్రుల అవసరాలను గుర్తించి, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించడంతో పాటు ఆరోగ్యపరమైన కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు వివరించా రు. గ్రామీణ ప్రాంతాల్లోని వయోవృద్ధులకు సైతం వైద్య పరీక్షలు నిర్వహించి, కంటి పరీక్షలతో పాటు ఇతర అవసరమైన పరీక్షలు చేసి



మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వయోవృద్ధుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వారి ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులు పేర్కొన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్యులు డాక్టర్ అమన్, డాక్టర్ రమ్య, డాక్టర్ తబియా, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ రజిత, డాక్టర్ రాము, వారి బృందాలు, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ మంచిర్యాల సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.



జన్నారం,అక్టోబర్1 (ప్రజాజ్యోతి)రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన జన్నారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది.ఎస్సై గుర్రపు ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన పురం శెట్టి నాగేష్(58) గురువారం సాయంత్రం జన్నారం నుండి రోటిగూడ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ సమీపంలో వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం లక్షెటిపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు పురం శెట్టి వేణు గోపాల్, పురం శెట్టి శ్రావణ్,కుమార్తె శ్రావణి భార్య వెంకటవ్వ లు ఉన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.ద

## రహదారిపై చెత్తాచెదారం తొలగింపు.. పాఠశాల సమీపంలో మొక్కలు నాటిన సర్పంచ్ మొహార్లే బాపూజీ కొమురం భీం జిల్లా క్రైమ్ రిపోర్ట్. మున్నా ఖాన్



**వాంకిడి:** మండలంలోని సరండి గ్రామపంచాయతీ పరిధిలో పరిశుభ్రత, పచ్చదనం పెంపునకు సర్పంచ్ మొహార్లే బాపూజీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారులపై పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. రహదారిపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ రహదారులు, వీధులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు శుభ్రత పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా పారిశుధ్య సిబ్బంది ద్వారా క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామంలోని పాఠశాల సమీపంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పాఠశాల పరిసర ప్రాంతంలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపుతో గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు భవిష్యత్ తరాలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలుగుతుందని సర్పంచ్ బాపూజీ పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాల

## ఆసిఫాబాద్ భాజపా పట్టణ అధ్యక్షుడిగా సంతోష్ కుమార్



**ఆసిఫాబాద్ అక్టోబర్ 1** ప్రజా జ్యోతి భాజపా పట్టణ అధ్యక్షుడిగా ఆకుల సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు, కోర్ కమిటీ నిర్ణయం మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగించారు ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లి కార్జున్ యాదవ్ సంతోష్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. గతంలో ఆర్‌ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లో పనిచేసిన అనుభవంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.

## గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం పై అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్ ఆదేశాల మేరకు

**విచారణ చేపట్టాం నివేదికను జిల్లా కలెక్టర్ పంపిస్తాం.**

**కాగజ్నగర్ డివిల్పిఓ హరిప్రసాద్**




**అక్టోబర్1,సిర్పూర్-టి కానిస్టేన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)లో కాగజ్నగర్ డివిల్పిఓ హరిప్రసాద్ ఆకస్మిక తనిఖీలో భాగంగా సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీని సందర్శించిన డివిల్పి హరిప్రసాద్ రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీలో గత సర్పంచ్ తఫీమా పర్వీన్ పదవి కాలంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు లోకల్ బాడీస్ డిస్ట్రిక్ అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మార్మట్ కు అందిన ఫిర్యాదు పై అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మార్మట్ ఆదేశాల మేరకు సర్పంచ్ ఒడ్డేటి నాగమణి,ఉపసర్పంచ్ దుర్గం ప్రశాంత్, 10 మంది వార్డు సభ్యులతో కలిసి గ్రామపంచాయతీ నిధులకు సంబంధించి గత 2019/ ఫిబ్రవరి నుండి ఫిబ్రవరి 2024 వరకు రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టడం జరిగిందని అన్నారు.ఇట్టి నిధుల దుర్వినియోగం నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని కాగజ్నగర్ డివిల్పిఓ హరిప్రసాద్ తెలిపారు.

## వృద్ధుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

**కలెక్టర్ కె.హరిత**




**ఆసిఫాబాద్, అక్టోబరు 1** ప్రజా జ్యోతివృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్‌లో విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపరాణితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, సంక్షేమ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే న్యాయ సహాయం పొందాలని తెలిపారు. వృద్ధుల సంరక్షణ, పోషణకు చట్టపరమైన రక్షణలు ఉన్నాయని పేర్కొన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 14567 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధి కరుణాకర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంజనీదేవి, అధికారులు పాల్గొన్నారు.

## అడ ప్రాజెక్టుకు పర్యాటక కళ మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక





**ఆసిఫాబాద్, అక్టోబర్ 1** ప్రజా జ్యోతి జిల్లాలోని సహజ, జలవనరులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తెలిపారు. గురువారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్‌తో కలిసి అడ ప్రాజెక్టు ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించారు.అడ ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే స్థానికులకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడటంతో పాటు సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా వ్యూయింగ్ పాయింట్లు, వాకింగ్ ట్రాక్‌లు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి ప్రదేశాలు, సమాచార కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రాంత సుందరీకరణ, లైటింగ్‌తో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగేలా అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్త్రీ విద్యతోనే దేశాభివృద్ధి దండేపల్లి, ఎస్సై రాజవర్ధన్



**దండేపల్లి,అక్టోబర్ 01(ప్రజాజ్యోతి):** స్త్రీ విద్యతోనే సమాజంతో పాటు దేశాభివృద్ధి సాధ్యమని దండేపల్లి ఎస్సై రాజవర్ధన్, సాంఘిక సమానత్వ సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'సైన్స్ – మూఢనమ్మకాల నిర్మూలన'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాస్త్ర విజ్ఞానం వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలోనూ ప్రజలు మూఢనమ్మకాలను నమ్మడం విచారకరమన్నారు. దొంగ స్వాములు, భూత వైద్యులు అమాయకులను ఆసరాగా చేసుకుని ఆర్థికంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని, మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సదస్సులో భాగంగా ఉప్పులేటి నరేష్ విద్యార్థులకు 'సైన్స్ మ్యాజిక్ షో' ప్రదర్శించారు. ఇసుక నుంచి నాణాలు తీయడం, చేతిపై కిరోసిన్‌తో మంటలు లేపడం, నోట్లో మంటలు తెప్పించడం, పచ్చి వేపాకులపై నీటితో మంటలు పుట్టించడం, నాలుకకు ఇనుప చువ్వ గుచ్చుకోవడం వంటి విన్యాసాలను ప్రదర్శించి.. వాటి వెనుక ఉన్న సైన్స్ సూత్రాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, నాయకుడు వడ్లూరి ప్రభు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హాజరు పెంచాలి.. విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పెంచడంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మట్, డీఈవో సచ్చిదానంద చారితో కలిసి మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్‌లో జిల్లా ర్యాంకు తక్కువగా ఉందని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం కూడా ఆశించిన స్థాయిలో లేదన్నారు. అనుమతి లేకుండా తరచూ విధులకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను తరచూ తనిఖీ చేయాలని సూచించారు. ప్రధానమంత్రి శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల వివరాలను యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని, సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. హాజరు శాతంలో స్పష్టమైన పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ప్రణాళికా సమన్వయకర్తలు శ్రీనివాస్, అబిద్ అలీ, అధికారులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలి

**వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి**

**వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య మంచిర్యాల జిల్లా అధ్యక్షులు సైండ్ల మొండయ్య**



**మంచిర్యాల, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి):**వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య మంచిర్యాల జిల్లా అధ్యక్షులు సైండ్ల మొండయ్య కోరారు .అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్హులైన వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య జిల్లా అధ్యక్షులు సైండ్ల మొండయ్య జిల్లా వయోవృద్ధులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ వయోవృద్ధుల సమాఖ్య సూచనల మేరకు వయోవృద్ధుల సంక్షేమం కోసం పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వయోవృద్ధులకు రైల్వే ప్రయాణాల్లో గతంలో కల్పించిన రాయితీలను పునరుద్ధరించాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వయోవృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. నిలిపివేసిన వయోవృద్ధుల గుర్తింపు కార్డుల జారీని జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) ద్వారా తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలని కోరారు. వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో ఫిజియోథెరపీ పరికరాలు లేకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే అవసరమైన పరికరాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డే కేర్ సెంటర్‌లోని పార్కు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆవరణ అస్తవ్యస్తంగా మారిందని, నూతన పార్కును ఏర్పాటు చేయడంతోపాటు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

**వయోశ్రేష్ఠులకు సన్మానం**

ఈ కార్యక్రమంలో వయోశ్రేష్ఠులైన గుర్రాల కృష్ణారెడ్డి, అల్లాడి చక్రపాణి, సీపతి సత్తయ్య, రిక్కుల రాజారెడ్డి, పొనుగోటి జగ్గారావు, తూముల రామయ్య, పానుగంటి పోచయ్య, బి. బాబయ్య, చిలుకోరి లింగయ్య, కారుకూరి లచ్చయ్య, జంగిడి ముత్తయ్య, అగ్గు లచ్చయ్య, చిలువేరు పెద్ద లచ్చయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కేఎంఎస్ రెడ్డి, సీహెచ్. ప్రభాకర్, బోనగిరి కృష్ణ, కె. నారాయణ, బోనగిరి రాజారెడ్డి, తోట రాజయ్య, ఏ. రవీందర్ రావు, కె. రాంనర్సయ్య, రమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సామల కిరణ్ ను సన్మానించారు...



**బెజ్జూర్ 01అక్టోంబర్** మండలకేంద్రంలో సామల కిరణ్ కు రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం లో పదవి రావడంతో గురువారం మాజి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లూరి సతీష్.అమిరుద్దిన్.నరేందర్ గౌడ్.జాహిద్ హుస్సైన్.షేర్.తదితరులు పాల్గొన్నారు

## ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు మురళికి ఘన సన్మానం



**ఆసిఫాబాద్ అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపర్తి మురళిని మోవాడు గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మండలంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తనపై చూపిన అభిమానానికి గ్రామ ప్రజలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు

## పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం

**-- సర్పంచ్ టేకం గంగారాం**



**ఆసిఫాబాద్అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందని అంకుసాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ టేకం గంగారాం అన్నారు. గురువారం అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రవిచంద్ర కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆయన ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ పరిసరాలు, రోడ్లు, కాలువలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గంగారాం మాట్లాడుతూ.. రోడ్లు, కాలువల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. గ్రామ పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాడి కవిత, ఉపాధ్యాయురాలు కుమారి, వార్డు సభ్యులు హస్తం సంపత్, అక్బర్, సందీప్‌కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్**

**మంచిర్యాల, 1,అక్టోబర్ (ప్రజాజ్యోతి):**వృద్ధుల హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ కోరారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని కోర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్‌లో డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులైన రాసకట్ల పోశం, బంగారి మల్లయ్య, ఎం. సత్యనారాయణలను శాలువాలతో సత్కరించి, కేక్ కట్ చేసి వృద్ధుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేణు మాధవ్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా వృద్ధుల సంక్షేమం, హక్కులు, ఆరోగ్యం, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనంపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి 1990 డిసెంబర్ 14న అక్టోబర్ 1ను అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవంగా ప్రకటించింది న్నారు. వృద్ధులు తమ జీవితమంతా కుటుంబ అభివృద్ధికి, సమాజ నిర్మాణానికి, దేశ ప్రగతికి విశేష సేవలు అందించారని, తమ అనుభవాన్ని, జ్ఞానాన్ని భావితరాలకు అందిస్తున్నారని అన్నారు. అలాంటి వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు వృద్ధాప్యంలో ప్రేమ, ఆప్యాయత, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక భద్రత, మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని తెలిపారు. భారతదేశంలో వృద్ధుల సంక్షేమం కోసం తల్లిదండ్రులు, వృద్ధ పౌరుల పోషణ మరియు సంక్షేమ చట్టం--2007 అమలులో ఉందని, ఈ చట్టం






ప్రకారం అర్హులైన వృద్ధ తల్లిదండ్రులు తమ పోషణ కోసం చట్టపరమైన సహాయం పొందవచ్చని వివరించారు. చట్టాలు రూపొందించడంతోపాటు వాటిని సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వృద్ధులు గౌరవప్రద మైన జీవనం సాగించేందుకు సరిపడా పింఛన్ అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య సేవలు, అవసరమైన మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆసుపత్రులు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో వృద్ధులకు ప్రాధాన్యత కల్పించాలని, బస్సులు, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో వారికి అనుకూలమైన సౌకర్యాలను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం చాలామంది వృద్ధులు ఒంటరితనం, కుటుంబ నిర్లక్ష్యం, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు పిల్లల ఆదరణకు దూరమై కనీస అవసరాల కోసం కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుటుంబ సభ్యులు వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, వారి అభిప్రాయాలను గౌరవిస్తూ కుటుంబ నిర్ణయాల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. వృద్ధుల ఆస్తులను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం, వేధించడం, నిర్లక్ష్యం చేయడం వంటి ఘటనలను అరికట్టేందుకు చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఫిర్యాదుల వ్యవస్థను బలోపేతం చేసి, వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. వృద్ధులు సమాజానికి భారం కాదని, అపారమైన జీవితానుభవం కలిగిన మార్గదర్శకులని పేర్కొన్నారు. యువత వారి అనుభవాల నుంచి నేర్చుకుంటూ, వారి సేవలను గుర్తించి గౌరవించాలని వేణు మాధవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు రాసకట్ల పోశం, ఎం. సత్యనారాయణ, బంగారి మల్లయ్య, ఎస్. లక్ష్మీనారాయణ, ఎం. రాజా నర్సు, చుక్కల నర్సయ్య, టి. శ్రీనివాస్, ఏ. ప్రభాకర్, ప్రతాప్ సింగ్, రవీందర్, ఎం.డి. రఫిక్ అహ్మద్, వంగ రవీందర్ రెడ్డి, బి. ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు కనీసం ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలి

**రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2027 మార్చిలో ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో కనీసం ఒక స్థానాన్ని బీసీలకు కేటాయించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ స్థానాలను అగ్రకులాలకు కేటాయించే నిర్ణయంపై పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు.రెండు స్థానాల్లో కనీసం ఒక స్థానాన్ని బీసీలకు కేటాయించి సామాజిక న్యాయాన్ని పాటించాలని కోరారు.ఒకవైపు కులగణన సామాజిక న్యాయం,బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతూ మరోవైపు బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకపోవడం సరికాదన్నారు.బీసీలకు జనాభా ప్రాతిపదికన తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బడుగు,బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెబుతున్నారని అదే విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు.ఎమ్మెల్సీ స్థానాల విషయంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు పునరాలోచించి బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కంభంపాటి విప్లవ కుమార్ రామాయంపేట పట్టణ అధ్యక్షులు పచ్చంటి రాము బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షులు చింతల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ.

**హోళగుంద :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అవ్వ తాతలు,వికలాంగులు, వితంతువులు,ఒంటరి మహిళలు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా గౌరవప్రదంగా పెన్షన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఈబీజీ గోవింద గౌడ అన్నారు.గురువారం ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఈర్లకట్ట కాలనీ,బుడగజంగాల కాలనీ పరిసర ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం?ప్రతి ఇంటికీ భరోసా,ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అవ్వతాతలు, అర్హులైన లబ్ధిదారుల జీవితాల్లో భరోసా నింపుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎర్రి స్వామి,టీడీపీ మండల కో-కన్వీనర్ జాకీర్, గాదిలింగ,బుడగజంగాల రామాంజి,టీడీపీ మండల మైనార్టీ అధ్యక్షులు ముల్లా మొయిన్,సురేష్,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ బండారి ఉమా మహేశ్వరి దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల నివాళులు

**కురవి :** మండల కేంద్రానికి చెందిన బండారి రమేష్ సతీమణి, అంగన్వాడీ టీచర్ బండారి ఉమా మహేశ్వరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో కురవి మండల కేంద్రంలోని వీరభద్ర ఏసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆమె దశదిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై నివాళులర్పించారు.ఈ సందర్భంగా మహేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్, కురవి టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేంద్రకుమార్, సమన్వయ కమిటీ అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్ర గౌడ్, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, కురవి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షులు అవిరే మోహన్ రావు, బానోత్ తుకారం నాయక్, ఆలయ ధర్మకర్త సక్రు నాయక్, నేరడ సర్పంచ్ గౌతమి వెంకన్న, గ్రామ అధ్యక్షులు బానోతు లాల నాయక్, బాదావత్ రామకృష్ణ, రాములు వెంకన్న, కురవి మాజీ వార్డు సభ్యులు బానోతు లక్ష్మణ్ నాయక్, బీఎల్ఏ కురవి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బాలాజీ, రాములు, గుగులోతు బాలాజీ, దెబ్బేటి వెంకటయ్య, రామ్మూర్తి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా పోలీసు స్కూలుకు రెండు కోట్ల విరాళం

**ఎంవైకే సంస్థకు డీజీపీ కృతజ్ఞతలు**

**హైదరాబాద్ :** తెలంగాణ డీజీపీ సి. వి. ఆనంద్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపిఎస్) అకాడమిక్ బ్లాక్ నిర్మాణానికి ?2 కోట్ల సీఎస్ఆర్ అందించిన ఎంవైకే లాటిక్రెట్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ పౌరుల పిల్లలకు కూడా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటువంటి సంస్థలు అందించే సహకారం వైఐపిఎస్ లో మెరుగైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి, విద్యార్థులకు ఎన్నో సంవత్సరాల పాటు ఉపయోగపడే సౌకర్యాలను కల్పించడానికి తమ ప్రయత్నాలకు ఎంతో విలువైన తోడ్పాటును అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సీఎస్ఆర్ ఫండ్ ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు దోహదపడుతుందని డీజీపీ తెలిపారు. ఎంవైకే లాటిక్రెట్ మేనేజింగ్ డైరెక్టర్ మురళి యాదమా, అయన వారి బృందానికి ఈ కార్యక్రమంలో భాగస్వాములైనందుకు డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు. వైఐపిఎస్ ద్వారా ప్రయోజనం పొందే విద్యార్థులకు వారి ఈ సహకారం చిరకాలం గుర్తుండిపోయే విలువైన మద్దతుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.